ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 28 -11-2024 | సంపుటి - 21 | సంచిక -220 | రూ : 4 | పేజీలు: 8

కావాల్సినన్ని 'సీట్లు'!

- దేశవ్యాప్తంగా బీటెక్ సీట్లు భారీగా పెంపు
- అందుబాటులోకి 14.90 లక్షల ఇంజనీరింగ్ సీట్లు
- దక్షిణాది రాష్ట్రాల నుంచే 40 శాతం
- 3.08 లక్షల సీట్లతో అగ్రస్థానంలో తమిళనాడు
- ఆ తర్వాతి స్థానాల్లో ఏపీ, తెలంగాణ

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ సీట్లు భారీగా పెరిగాయి. 202425 విద్యా సంవత్సరంలో బీటెక్ సీట్ల సంఖ్య 14.90 లక్షలకు చేరింది. 202122లో దశాబ్దంలోనే కనిష్ట స్థాయికి (12.54 లక్షలకు) పడిపోయిన తర్వాత.. మళ్లీ ఇప్పుడు 18.84 శాతం మేర సీట్లు పెరగడం విశేషం. వాస్తవానికి

తరువాయి 2లో

2లో

దూసుకొస్తున్న 'ఫెంగల్'

- తుపానుగా బలపడిన తీవ్ర వాయుగుండం
- 30న తమిళనాడు, శ్రీలంక మధ్యలో తీరం దాటే అవకాశం
- నెల్లూరు, తిరుపతి జిల్లాలకు భారీ వర్ష సూచన
- కోస్తాంధ్రలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షా లు
- డిసెంబరు 3 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దన్న వాతావరణ శాఖ
- వివిధ పోర్టుల్లో ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ

సర్కారీ బడుల్లో స్పోకెన్ ఇంగ్లిష్

2లో

రూ.5,900 కోట్ల విలువైన బిట్‌కాయిన్లు చెత్తకుప్ప పాలు!

- బ్రిటన్‌లో ఓ మహిళ నిర్వాకం

లండన్: అనగనగా ఒక పాత హార్డ్‌డ్రైవ్. బ్రిటన్‌కు చెందిన 39 ఏళ్ల జేమ్స్ హావెల్స్ అనే వ్యక్తి క్రిప్టోకరెన్సీ తొలినాళ్లలో అంటే 2009 ఏడాదిలో 8,000 బిట్‌కాయిన్లను మైనింగ్ చేశాడు. వాటికి సంబంధించిన డిజిటల్ కీని ఆ పాత హార్డ్‌డ్రైవ్‌లో దాచి ఉంచాడు. అయితే అది తర్వాత కనిపించకుండా పోయింది. తన ప్రియురాలు హఫీనా ఎడీ ఎవాన్స్‌తో కలిసి ఈ హార్డ్‌డ్రైవ్ కోసం వేట మొదలెట్టాడు. అది కనిపించట్లేదని ఫిర్యాదు కూడా చేశాడు. అయితే అది 2013 ఏడాదిదాకా ఇంట్లోనే ఒక గదిలో సొరుగులో ఉండిపోయింది. అయితే 2013లో ఇంటిని ప్రియురాలు హఫీనా శుభ్రంచేస్తుండగా పాత కంప్యూటర్ విడిభాగాలున్న ఒక పాత నల్ల సంచి కనిపించింది. దీనిని పడేయాలా? అని జేమ్స్‌ను హఫీనా అడగ్గా అవసరం లేదు పడేసెయ్ అని చెప్పాడు. దీంతో బయటికెళ్తూ దారిలో ఉన్న చెత్తకుప్పలో దానిని పడేసి వెళ్లిపోయింది. తర్వాత ఇద్దరూ దాని కోసం వేట కొనసాగించారు. అయితే తాజా దర్యాప్తులో.. ఆమె గతంలో పడేసిన సంచిలోనే హార్డ్‌వేర్ ఉందని తాజాగా వెల్లడైంది. హార్డ్‌వేర్‌లోని డిజిటల్ కీ సాయంతో అందుబాటులోకి వచ్చే 8,000 బిట్‌కాయిన్ల ప్రస్తుత మార్కెట్ విలువ

తరువాయి 2లో

పోలవరం ఇక బ్యారేజ్!

- 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వ.. తేల్చి చెప్పిన కేంద్రం..
- అటు కేంద్రం.. ఇటు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాల నిర్వాకం బట్టబయలు
- 45.72 మీటర్ల ఎత్తులో నీటి నిల్వకు నిధుల కోసం ఫిబ్రవరి 27న పీఐబీ ప్రతిపాదన

2లో

30 నుంచి బీఆర్ఎస్ గురుకుల బాట..

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో కమిటీ: కేటీఆర్
- గురుకులాలు, కేజీబీవీ సూళ్ల పరిశీలన
- 30 నుంచి వచ్చే నెల 7 వరకు పర్యటన
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 27 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుసగా కొనసాగుతున్న మరణాలు, విషాద ఘటనల నేపథ్యంలో ఆయా విద్యాసంస్థల్లో నెలకొన్న పరిస్థితులను తెలుసుకునేందుకు పార్టీ తరఫున గురుకులబాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్టు బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. 30 తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న గురుకుల విద్యాసంస్థలతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ

తరువాయి 2లో



త్వరలో సెట్‌ల తేదీలు వెల్లడి

- ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీల ఖరారుపై కసరత్తు షురూ
- ఈఏపీ సెట్‌ను కొంచెం ముందుగానే నిర్వహించే యోచన
- నిర్వహణ బాధ్యతలు వర్సిటీలకు అప్పగింతపై ఉన్నత విద్యామండలి దృష్టి

2లో

ఐటీలో కొలువుల పండుగ

- వచ్చే 6 నెలల్లో 12 శాతం
- వృద్ధి అంచనా

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థల స్వరూపాన్ని సంపూర్ణంగా మార్చి వేయగల టెక్నాలజీలు త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఐటీ సర్వీసుల విభాగంలో నియామకాలు జోరందుకోనున్నాయి. రాబోయే ఆరు నెలల కాలంలో ఐటీ రంగంలో నియామకాలు 1012 శాతం పెరుగుతాయని క్వెస్ కార్ప్ తాజా నివేదికలో అంచనా వేసింది. ప్రధానంగా జెనరేటివ్ ఏఐ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ విభాగాల్లో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆ సంస్థ చెబుతోంది. జూన్ త్రైమాసికంతో పోల్చితే నిపుణుల డిమాండు గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) విభాగంలో 71 శాతం, సైబర్ సెక్యూరిటీ విభాగంలో 58 శాతం పెరిగినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి రెండు

తరువాయి 2లో

జనవరి 31న నీట్ ఎండీఎస్

- మార్చి 29-30న నీట్ ఎస్ఎస్

న్యూఢిల్లీ, నవంబర్ 27: వచ్చే ఏడాది జరిగే నీట్ ఎండీఎస్, నీట్ ఎస్ఎస్ పరీక్షలతోపాటు ముఖ్యమైన పలు ఇతర పరీక్షల తేదీలను ఎన్‌బీఈఎంఎస్ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్) తాత్కాలికంగా ప్రకటించింది. జనవరి 31న నీట్ ఎండీఎస్, మార్చి 2930న నీట్ ఎస్ఎస్ పరీక్షలను నిర్వహించనున్నట్టు వెల్లడించింది. వీటితోపాటు ఫారిన్ డెంటల్ స్క్రీనింగ్ టెస్ట్ (ఎఫ్‌డీఎస్‌టీ), ఫార్మాటివ్ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఏటీ), డీఎన్‌బీ (బోర్డ్ స్పెషాలిటీ)

తరువాయి 2లో

అదానీపై లంచం ఆరోపణల్లేవు!

- సెక్యూరిటీస్ మోసం, కుట్ర అభియోగాలే...
- అదానీ గ్రీన్ ఎనర్జీ వివరణ

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీ, కంపెనీ బోర్డు సీనియర్ డైరెక్టర్ వినీత్‌జైన్‌పై అమెరికా న్యాయ శాఖ లంచం అభియోగాలు మోపలేదని అదానీ గ్రూప్ సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ స్పష్టం చేసింది. ''న్యూయార్క్ కోర్టులో గత వారం అమెరికా న్యాయ శాఖ (యూఎస్ డీఓజే) దాఖలు చేసిన అభియోగ పత్రంలో, యూఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ (ఎఫ్‌సీపీఏ/అవినీతి నిరోధక) చట్టం నిబంధనలను

తరువాయి 2లో

అదానీపై లంచం ఆరోపణల్లేవు!

(మొదటిపేజీ తరువాయి)

ఉల్లంఘించే కుట్రకు పాల్పడినట్టు వ్యవస్థాపక చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ లేదా వినీత్‌జైన్‌పై అభియోగాలు మోపలేదు''అని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) బుధవారం వివరణ ఇచ్చింది సెక్యూరిటీస్ చట్టం కింద మోసం, కుట్ర, ఉద్దేశపూర్వక కుట్ర ఆరోపణలే మోపినట్టు తెలిపింది. ఈ అభియోగాలకు చట్టం పరిధిలో శిక్షలు లంచం కంటే చాలా తక్కువని పేర్కొంది. మరోవైపు సెక్యూరిటీల చట్టం నిబంధనలు ఉల్లంఘించారంటూ.. చట్ట ఉల్లంఘన దిశగా అదానీ గ్రీన్ ఎనర్జీకి సాయం అందించారంటూ గౌతమ్ అదానీ, సాగర్ అదానీ మరో సివిల్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్నట్టు ఏజీఈఎల్ వివరణ ఇచ్చింది. సెక్యూరిటీస్ చట్టం 1933, సెక్యూరిటీస్ చట్టం 1934లోని పలు సెక్షన్లను వీరు ఉల్లంఘించారని.. ఏజీఈఎల్ సైతం ఇవే చట్ట ఉల్లంఘనలకు పాల్పడేందుకు సాయం లేదా ప్రోత్సాహం అందించినట్టు సివిల్ కేసులో అభియోగాలు మోపినట్టు వెల్లడించింది. ఏజీఈఎల్ సోలార్ విద్యుత్ సరఫరా కాంట్రాక్టులను దక్కించుకునేందుకు వీలుగా భారత అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇచ్చారంటూ అదానీ తదితరులపై కొన్ని రోజుల క్రితం సంచలన ఆరోపణలు రావడం తెలిసిందే. ఈ క్రమంలో ఆదానీ గ్రీన్ ఎనర్జీ ఇచ్చిన వివరణకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇవన్నీ నిరాధార ఆరోపణలు అని, ఈ విషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అదానీ గ్రూప్ ఇప్పటికే వివరణ ఇచ్చింది.

అదరగొట్టిన అదానీ షేర్లు...

అమెరికా లంచం ఆరోపణలపై అదానీ గ్రూప్ వివరణ ఇవ్వడంతో అదానీ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అదానీ టోటల్ గ్యాస్ 20%, అదానీ పవర్ 20%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10%, అదానీ గ్రీన్ ఎనర్జీ 10% లాభపడ్డాయి. ఈ షేర్లన్నీ ఇంట్రాడేలో అప్పర్‌సర్క్యూట్ తాకాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 12%, ఎన్‌డీటీవీ 9%, అదానీ విల్మార్ 8%, అదానీ పోర్ట్స్ 6%, సంఘీ ఇండస్ట్రీస్ 5%, అంబుజా సిమెంట్స్ 4.50%, ఏసీసీ 4% పెరిగాయి. పదకొండు కంపెనీల షేర్లూ రాణించడంతో ఒక్కరోజులో అదానీ గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.24 లక్షల కోట్లు పెరిగింది.

పోలవరం ఇక బ్యారేజ్!

అమరావతి : పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ 41.15 మీటర్ల ఎత్తుకే పరిమితమని కేంద్రం తేల్చి చెప్పింది. ఆ మేరకు నీరు నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేయడానికి సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు ఆమోదం తెలిపామని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి రాత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు మేరకు పోలవరం ప్రాజెక్టును గరిష్ట నీటి మట్టం 45.72 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తున్నామని.. ఎత్తును తగ్గించలేదని చెప్పారు.

కానీ.. 41.15 మీటర్ల ఎత్తు వరకే నీటిని నిల్వ చేసేలా ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తద్వారా అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు పోలవరం రిజర్వాయర్‌ను బ్యారేజ్‌గా మార్చేశాయని నీటి పారుదల రంగ నిపుణులు, అధికార వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీని వల్ల పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల పథకాల కింద నీళ్లందిస్తున్న 1.53 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడానికి మాత్రమే పోలవరం బహుళార్థ సాధక జాతీయ ప్రాజెక్టు అక్కరకు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ఆయకట్టుకు కూడా గోదావరికి వరద వచ్చే రోజుల్లో మాత్రమే నీళ్లందించడానికి సాధ్యమవుతుందని చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు కింద మిగతా 5.67 ఎకరాలతోపాటు కృష్ణా డెల్టాలో 13.06 లక్షలు, గోదావరి డెల్టాలో 10.50 లక్షల ఎకరాల స్థిరీకరణ.. 540 గ్రామాల్లోని 28.50 లక్షల మందికి తాగునీళ్లు అందించడం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. విశాఖపట్నం పారిశ్రామిక, తాగునీటి అవసరాలకు 23.44 టీఎంసీలు అందించడం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కింద 8 లక్షల ఎకరాలకు నీళ్లందించడం అసాధ్యమని తేల్చి చెబుతున్నారు. ఇక ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మిస్తున్న 960 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి వీలుండదని.. గోదావరి సిగలో కలికితురాయిగా వెలుగులీనాల్సిన ఆ కేంద్రం ఒట్టి దిష్టి□ొమ్మగా మారుతుందని విద్యుత్ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోరు మెదపని టీడీపీ కేంద్ర మంత్రి

పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయడానికి నిధులు మంజూరు చేయాలని.. తొలి దశలో కనీస నీటి మట్టం 41.15 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేయడానికి నిధులు విడుదల చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 27న పీఐబీ (పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు) కేంద్రానికి ప్రతిపాదించింది. 41.15 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తే 1.53 లక్షల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే నీళ్లందించవచ్చని, 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తేనే ప్రాజెక్టు కింద 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతో పాటు గోదావరి, కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించడం, విశాఖకు నీటి సరఫరా చేయొచ్చని ఆ ప్రతిపాదనలో పీఐబీ స్పష్టం చేసింది అయితే అప్పటికే ఎన్‌డీఏలో చేరిన చంద్రబాబు.. ఆ ప్రతిపాదనపై ఆమోద ముద్ర వేస్తే వైఎస్సార్‌సీపీకి ప్రయోజనం చేకూరుతుందని బీజేపీ పెద్దల చెవిలో వేశారు. దాంతో అప్పట్లో పీఐబీ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది. కానీ.. ఆగస్టు 28న పీఐబీ ప్రతిపాదించిన దానికి భిన్నంగా.. 41.15 మీటర్ల ఎత్తుకే నీటి నిల్వను పరిమితం చేస్తూ పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందుకు కేంద్ర ఆర్థిక శాఖ పంపింది. ఈ ప్రతిపాదనపై ఆ సమావేశంలో ఉన్న టీడీపీకి చెందిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అభ్యంతరం చెప్పలేదు. అంటే.. అటు కేంద్రంతోపాటు ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పోలవరం ప్రాజెక్టులో నీటి నిల్వ ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేయడానికి అంగీకరించాయన్నది స్పష్టమవుతోంది.

*** నాడూ.. నేడూ పోలవరానికి 'చంద్ర' ద్రోహం**

రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును అప్పట్లో ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కమీషన్ల కక్కుర్తితో నిర్మాణ బాధ్యతలను తీసుకున్నారు. ఈ క్రమంలో 201314 ధరల ప్రకారం తాగునీటి విభాగం, జల విద్యుత్ విభాగానికి అయ్యే వ్యయం కాకుండా కేవలం నీటి పారుదల విభాగానికి అయ్యే వ్యయం రూ.20,398.61 కోట్లు ఇస్తే చాలని చెప్పారు. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం సంగతి గాలికొదిలేశారు. కమీషన్లు వచ్చే మట్టి పనులనే 201619 మధ్య చేపట్టి, ఆ ప్రాజెక్టులో విధ్వంసం సృష్టించారు. తద్వారా డయా ఫ్రం వాల్ దెబ్బ తినడానికి, ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం కోతకు గురవ్వడానికి వరద మళ్లింపు పనులు పూర్తి చేయక పోవడమేనని అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఇటీవల తేల్చి చెప్పింది. అప్పట్లో విధ్వంసం సృష్టించి.. ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి.. పోలవరానికి ద్రోహం చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు కూడా అదే బాటలో పయనిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

*** రెండు దశల్లో పోలవరం.. ప్రతిపాదించింది కేంద్రమే**

నీటి పారుదల, తాగు నీటి విభాగాలు వేర్వేరు కాదని, రెండూ ఒకటేనని, తాగునీటి విభాగానికి అయ్యే రూ.4,068 కోట్లను ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ.. ఆ ప్రతిపాదనను కేంద్ర జల్ శక్తి శాఖకు పంపారు. ఈ అంశంపై 2021 జూలై 29న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రతిపాదనతో సీడబ్ల్యూసీ నాటి ఛైర్మన్ హెచ్‌కే హల్దర్ ఏకీభవించారు. ఆ సమావేశంలో 1986 మార్చి 13న సీడబ్ల్యూసీ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు.. ప్రాజెక్టు పూర్తయిన తొలి ఏడాది కనీస నీటి మట్టం స్థాయిలో నీటిని నిల్వ చేయాలని.. ఆ తర్వాత దశల వారీగా ప్రాజెక్టులో గరిష్ట స్థాయిలో నీటిని నిల్వ చేయాలని హల్దర్ సూచించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా పోలవరంలో 35.44, 35.50, 41.15, 45.72 మీటర్ల స్థాయిలో నీటిని నిల్వ చేస్తే ఏం ప్రయోజనాలు కలుగుతాయో తెలపాలంటూ పీపీఏ సీఈవోకు కేంద్ర జల్ శక్తి శాఖ అప్పటి సీనియర్ జాయింట్ కమిషనర్ అనూప్ కుమార్ శ్రీవాత్సవ 2021 అక్టోబర్ 27న లేఖ రాశారు. ఇదే లేఖను ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిన పీపీఏ.. ఆ వివరాలు ఇవ్వాలని కోరింది. 35.44, 35.50 మీటర్లలో నీటిని నిల్వ చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని.. కనీస నీటి మట్టం 41.15 మీటర్లలో నిల్వ చేస్తే పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల కింద ఉన్న 1.53 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చని.. 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేస్తేనే ప్రాజెక్టు కింద 7.20 లక్షల ఎకరాలకు నీళ్లందించడంతోపాటు గోదావరి, కృష్ణా డెల్టాల ఆయకట్టును స్థిరీకరించడం, 28.50 లక్షల మందికి తాగు నీరు, విశాఖకు 23.44 టీఎంసీలు సరఫరా చేయవచ్చునని వివరించారు.

కావాల్సినన్ని 'సీట్లు'!

(మొదటిపేజీ తరువాయి)

2014/15లో దాదాపు 17.05 లక్షల సీట్లు ఉండగా.. ఆ తర్వాత ఏటా తగ్గుదల నమోదయ్యింది. మళ్లీ తిరిగి 202223లో 2 శాతం, 202324లో 5 శాతం, ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా 10 శాతం(1.40 లక్షలు) మేర సీట్ల సంఖ్య పెరిగింది. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) గణాంకాల ప్రకారం దేశంలో 2,906 అనుమతి పొందిన యూనివర్సిటీలు, కాలేజీల్లో 14.90 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. కొత్తగా 1,256 కాలేజీల్లో ఇన్‌టేక్ పెంపునకు ఆమోదం పొందాయి.

దూసుకొస్తున్న 'ఫెంగల్'

అమరావతి/విశాఖపట్నం : ఫెంగల్ తుపాను దూసుకొస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ఉత్తర వాయువ్య దిశగా గంటకు 12 కి.మీ వేగంతో కదులుతూ ట్రింకోమలీకి తూర్పుగా 110 కిలోమీటర్లు, నాగపట్నానికి ఆగ్నేయంగా 350 కి.మీ., పుదుచ్చేరికి ఆగ్నేయంగా 450 కి.మీ., చెన్నైకి ఆగ్నేయంగా 500 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమైందని వాతావరణ శాఖ, విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపాయి. ఇది బుధవారం సా.5.30కు తుపానుగా బలపడింది. అనంతరం.. శ్రీలంక తీరాన్ని దాటి తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశముంది. 30న దక్షిణ తమిళనాడు, శ్రీలంక మధ్యలో తీరం దాటే అవకాశాలున్నాయని.. ఆ తర్వాత బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారనున్నట్లు వెల్లడించాయి. దీని ప్రభావం ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోనూ, రాయలసీమలోని తిరుపతి జిల్లాలోనూ ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అలాగే, కోస్తాంధ్రలో అక్కడక్కడ గురు, శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు విస్తారంగా పడతాయన్నారు. ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని.. అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. మత్స్యకారులెవరూ డిసెంబరు 3 వరకూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. ఇక తుపాను కారణంగా విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక.. కాకినాడ, గంగవరం పోర్టుల్లో సిగ్నల్ 4తో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మరోవైపు.. నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 9491077356 (చిత్తూరు).. నెల్లూరు ప్రజలు 0861 2331261 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలి. అధికారులకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు రద్దుచేశారు.

రూ.5,900 కోట్ల విలువైన బిట్‌కాయిన్లు చెత్తకుప్ప పాలు!

(మొదటిపేజీ తరువాయి)

ఏకంగా రూ.5,900 కోట్లు కావడం గమనార్హం. విషయం తెల్సి హఫీనా హుతాశురాలైంది. ప్రస్తుతం వీళ్లిద్దరూ విడిపోయారు. ''జేమ్స్ సంపదను తెలీకుండా చెత్తపాలు చేశాను. దాని కోసం అతను పడుతున్న వేదనను చూడలేకపోతున్నా''అని తాజాగా హఫీనా వాపోయారు. హఫీనా పడేసిన చెత్తకుప్పలోని వ్యర్థాలు సాధారణంగా వేల్స్‌లోని న్యూపోర్ట్‌లో ఉన్న డాక్స్‌వే భారీ డంపింగ్ యార్డ్‌కు చేరుకుంటాయి. అక్కడ ఏకంగా 14,00,000 టన్నుల చెత్తకుప్ప కొండ ఉంది. అందులో ఎలాగైనా తన హార్డ్‌డ్రైవ్‌ను తిరిగి సంపాదిస్తానని జేమ్స్ బయల్దేరారు. అయితే అంత చెత్తను కింది నుంచి మొత్తం తిరగతోడితే కాలుష్యం పెరిగి చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యావరణ సమస్యలు వస్తాయని న్యూపోర్ట్ సిటీ కౌన్సిల్ ససేమిరా అంటోంది. యార్డ్‌లోకి అతనికి అనుమతి నిరాకరించింది. దీంతో జేమ్స్ కోర్టును ఆశ్రయించాడు. మొత్తం గాలించి హార్డ్‌డ్రైవ్ దొరికితే కుబేరుడినయ్యాక సంపదలో 10 శాతాన్ని న్యూపోర్ట్ అభివృద్ధికి కేటాయిస్తానని, నగరాన్ని దుబాయ్, లాస్ వెగాస్ సిటీలా తీర్చిదిద్దుతానని కోర్టుకు విన్నవించుకున్నాడు. ఈ అంశాన్ని డిసెంబర్‌లో విచారిస్తామంటూ ఈ కేసును కోర్టు వాయిదావేసింది.

త్వరలో సెట్‌ల తేదీలు వెల్లడి

హైదరాబాద్: రాష్ట్ర ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీలు ఖరారు చేసేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు మొదలుపెట్టింది. డిసెంబర్ మొదటి వారంలో తేదీలను ప్రకటించే వీలుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్)పై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈసారి ఈ పరీక్షను ముందుకు జరపాలని, తద్వారా విద్యా సంవత్సరాన్ని ముందే ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఇటీవల మండలి ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. ప్రవేశ పరీక్ష, ఫలితాల వెల్లడి, కౌన్సెలింగ్ తేదీలను ఒకేసారి ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నారు. యాజమాన్య కోటా సీట్లను కూడా ఈసారి ఆన్‌లైన్ విధానంలో భర్తీ చేస్తామని మండలి చైర్మన్ తెలిపారు. దీనిపైనా త్వరలో నిర్ణయం తీసుకునే వీలుంది.

త్వరగా తేదీలివ్వండి..

ఈఏపీసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పాలిసెట్, ఐసెట్, ఈసెట్‌లను ఎప్పుడు నిర్వహించాలో సూచించాల్సిందిగా టీసీఎస్ సంస్థను మండలి కోరింది. ప్రతి సంవత్సరం పరీక్షల నిర్వహణకు తేదీలను ఎంపిక చేసే బాధ్యత ఈ సంస్థకు అప్పగిస్తారు. జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల తేదీలను, ముఖ్యంగా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలను పరిగణనలోకి తీసుకుంటారు. ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్‌లో ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. దీని తర్వాత ఈఏపీ సెట్‌కు సన్నద్ధమయ్యేందుకు వీలుగా టీసీఎస్ తేదీలను ఖరారు చేస్తుంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా తేదీలను వెల్లడించాలని టీసీఎస్‌ను అధికారులు కోరారు.

ఏ సెట్ బాధ్యత ఎవరికి?

ఏ ఉమ్మడి పరీక్షను ఏ యూనివర్సిటీకి అప్పగించాలి? ఎవరిని కన్వీనర్‌గా తీసుకోవాలి? ఏవిధంగా నిర్వహించాలి? అనే అంశాలపై సమగ్ర వివరాలు ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి అన్ని యూనివర్సిటీల వీసీలకు వచ్చే వారం లేఖ రాయబోతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సాధారణంగా ప్రతి ఏటా ఈఏపీ సెట్‌ను జేఎన్‌టీయూహెచ్‌కు అప్పగిస్తున్నారు. సాంకేతిక అంశాలతో ముడిపడిన పరీక్ష కావడంతో సాంకేతిక విశ్వవిద్యాలయానికి అప్పగిస్తున్నారు. ఈసారి కూడా ఈ వర్సిటీకే ఈ సెట్ అప్పగించే వీలుంది. లాసెట్, ఎడ్‌సెట్‌ను ఉస్మానియా యూనివర్సిటీకి అప్పగించాలని భావిస్తున్నారు. ఐసెట్‌ను కాకతీయ వర్సిటీకి అప్పగించే వీలుందని తెలుస్తోంది. పాలిసెట్, ఈసెట్‌పై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

ఐటీలో కొలువుల పండుగ

త్రైమాసికాల గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. క్వెస్ ఐటీ స్టాఫింగ్ డిజిటల్ నైపుణ్యాల నివేదిక ప్రకారం డెవల్‌పమెంట్, ఈఆర్‌పీ, టెస్టింగ్, నెట్‌వర్కింగ్, డేటా సైన్స్ సహా ఐదు విభాగాల్లో స్థూల డిమాండు 79 శాతం పెరిగిందని ఆ విభాగం సీఈఓ కపిల్ జోషి తెలిపారు.

నివేదిక ముఖ్యాంశాలు..

టెక్ ఉద్యోగాలకు జీసీసీలు ప్రధాన చోదక శక్తిగా ఉన్నాయి. ఏఐ/ఎంఎల్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్, డెవ్ ఆప్స్ విభాగాల్లో నిపుణుల డిమాండు అధికంగా ఉంది. టెక్ విభాగంలో 62 శాతం ఉద్యోగ ప్రకటనలతో బెంగళూరు తిరుగులేని నాయకత్వ స్థానంలో ఉంది. హైదరాబాద్ (43.5 శాతం), పూణె (10 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జీసీసీల విస్తరణతో విభిన్న నగరాల్లో నిపుణులకు డిమాండు గణనీయంగా పెరుగుతోంది. ఇంజినీరింగ్, ఐటీ, ఫైనాన్స్, అనలిటిక్స్ విభాగాల్లో నిపుణులను జీసీసీలు అధికంగా నియమించుకుంటున్నాయి.

జనవరి 31న నీట్ ఎండీఎస్

(మొదటిపేజీ తరువాయి)

ఫైనల్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్స్, ఫెలోషిప్ ఎంట్రెన్స్ టెస్ట్2024 తదితర పరీక్షల తేదీలను ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను ఎన్‌బీఈ. ఈడీయూ.ఐఎన్‌లో చూడొచ్చు.ఆసుపత్రుల చైన్ పారస్ హెల్త్‌కేర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ డీఏఎం క్యాపిటల్

30 నుంచి బీఆర్ఎస్ గురుకుల బాట..

(మొదటిపేజీ తరువాయి)

రెసిడెన్షియల్ పాఠశాలలను, కాలేజీలను పరిశీలిస్తామని చెప్పారు. గురుకుల బాట కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొంటారు. బాలికల విద్యాసంస్థల్లో పార్టీ తరఫున విద్యార్థి విభాగం మహిళా నాయకులు, పార్టీ మహిళా నాయకులు సందర్శిస్తారని తెలిపారు. జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మహిళా సీనియర్ నాయకులు గురుకుల విద్యాసంస్థలను సందర్శించి బాలికల సమస్యలను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని వివరించారు.

విద్యార్థులను పొట్టనపెట్టుకుంటున్న పాపిష్టి పాలన

ముఖ్యమంత్రికి పరిపాలన అనుభవం లేకపోవడం, కీలకమైన విద్యాశాఖను తన దగ్గరే పెట్టుకొని నిర్లక్ష్యం చేస్తుండటం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని కేటీఆర్ దుయ్యబట్టారు. మొదటి సంఘటన జరిగినప్పుడే స్పందించి ఉంటే ఇంతమంది విద్యార్థుల ప్రాణాలు పోయి ఉండేవి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రికి ఆ పిల్లల తల్లిదండ్రుల కడుపుకోత కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఢిల్లీకి 28 సార్లు వెళ్లడానికి ముఖ్యమంత్రికి సమయం ఉంది కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చనిపోతుంటే కనీసం ఒకసారి కూడా సమీక్ష నిర్వహించాలన్న సోయిలేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు సరైన అన్నం పెట్టడం, వారి బాగోగులు చూసుకోవడం కూడా చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరితే బీఆర్ఎస్వీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, విద్యార్థులను పొట్ట పెట్టుకుంటున్న పాపపు పాలన అని మండిపడ్డారు. విద్యార్థుల చావులను పట్టించుకోని ఈ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుందన్నారు. నిర్వహణ చేతకాక ఈ ప్రభుత్వం గురుకుల, పాఠశాల విద్యను పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదవుకు దూరం చేసే కుట్రలో భాగంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇంత నిర్దయగా వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. వరుసగా ఇన్ని సంఘటనలు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రికి చీమ కుట్టినట్టు కూడా లేదా? అని ప్రశ్నించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో కమిటీ

గురుకుల విద్యాసంస్థల నిర్వహణలో అపారమైన అనుభవమున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమిస్తున్నామని కేటీఆర్ ప్రకటించారు. కమిటీలో డాక్టర్ ఆంజనేయులుగౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారాంయాదవ్, వాసుదేవరెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని చెప్పారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేసిన ప్రవీణ్‌కుమార్‌కు విద్యా సంస్థల నిర్వహణ, అకడి సమస్యలపై సమగ్ర అవగాహన ఉందన్నారు.

కుటుంబ సర్వేకు నమోదు గాని వారు పురపాలక సంఘ కార్యాలయంలో సమాచారం అందించాలి

యాదగిరి గుట్ట, (ప్రజాస్ఫూర్తి) : కుటుంబ సర్వేకు నమోదు గాని కుటుంబాల వారు యాదగిరిగుట్ట పురపాలక సంఘ కార్యాలయం నందు ఏర్పాటు చేయబడి మొబైల్ నెంబరు 9963 287132 ద్వారా సర్వే పూర్తికాని విషయం తెలియజేయాలని యాదగిరిగుట్ట పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదగిరిగుట్ట పురపాలక సంఘ పరిధిలోని ఆవాస ప్రాంతాల్లో సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా, మీరు అందుబాటులో లేకపోవడం, మీ ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ సర్వేలో నమోదు గాని కుటుంబాల వారు ఇంకా మిగిలి ఉన్న కుటుంబాల వారికి మీ ఇంటికి వచ్చి సర్వే చేయబడుతుందని తెలిపారు.

మతి స్థిమితం కొల్పోయిన కెటిఆర్

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిఆర్ఎస్ అధికారం కొల్పోగానే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మతిస్థిమితం కొల్పోయాడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హామీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిలుపుదల చేయకుండా ముందుకు సాగుతున్నామని, ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేశామని అన్నారు. దీన్ని ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని అన్నారు. రైతులకు తగిన న్యాయం చేస్తూ రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని, రెండు లక్షలపైన ఉన్న వారికి కూడా రుణమాఫీ చేసేందుకు ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. గతంలో ఎన్నడు లేనివిధంగా కాలేశ్వరం నీళ్లు లేకుండా భారతదేశంలోనే అత్యధిక వరి ధాన్యాన్ని పండించిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని అన్నారు. వడ్ల కొనుగోలులో కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ ఎంతో చిత్తశుద్ధితో నిత్యం ప్రజలతో మమేకమైతూ ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నారని, వారిని దూషించడం సరికాదని అన్నారు. మీ అయ్య కాళ్లు మొక్కితేనే మంచి కలెక్టర్ అవుతారా... లేకపోతే కాంగ్రెస్ కార్యకర్త అవుతారా... అని కెటిఆర్‌ను ప్రశ్నించారు. మతి భ్రమించి మాట్లాడడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి జన్మదినం సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నాచారం ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి శాలువా కప్పి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జెఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపల్లి పద్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నర్సింహులు, యవాపురం రవి, జిల్లా కోశాధికారి బెల్ది అశోక్, సభ్యులు కె.వెంకట్ , రామచంద్ర మూర్తి, డి.కిరణ్ కుమార్ రావు, డి.శ్రీనివాసరావు, నిరంత్, దాసారం శ్రీనివాస్, జి.శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

సమాజానికి చేసే సేవ శాశ్వతంగా నిలిచిపోతుంది

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాస్ఫూర్తి,ఖమ్మం : సమాజంలో నలుగురికి ఉపయోగపడే పనులు చేస్తూ సేవలు అందించే వారే శాశ్వతంగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం రఘునాధపాలెం మండలం వి. వెంకటాయ పాలెం గ్రామంలోని జహీర్ అహ్మద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 లక్షల 50 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన బోర్ వెల్, పైప్ లైన్, ఆర్. ఓ.ప్లాంట్ ను, 50 వేల విలువ గల కరెంట్ మోటర్ ను జిల్లా కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.కుతుంబాక బసవ నారాయణ, కుతుంబాక కోటేశ్వరరావు స్నేహానికి జ్ఞాపకార్థంగా పాఠశాలకు 3 లక్షల 50 వేల విలువచేసే ఆర్.ఓ. ప్లాంట్, బోర్ వెల్, పైప్ లైన్ ను కూతుంబాక మధు, 50 వేల రూపాయల కరెంట్ మోటర్ ను కూరాకుల నాగభూషణం పాఠశాలకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల అవసరాలను తీర్చేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా విద్యార్థుల శ్రేయస్సు గురించి ఆలోచించి వసతులు కల్పించడం సంతోషకరమని అన్నారు. పాఠశాలలో అవసరమైన టాయిలెట్లు సైతం రాబోయే రోజులలో పూర్తి చేస్తామని అన్నారు. పాఠశాలకు జహీర్ అహ్మద్ పేరు పెట్టారని, కొంత సమయం గడిచిన తర్వాత మన రంగు, కులం, మతం, ఆస్తి ఎవరు గుర్తు పెట్టుకోరని, సమాజంలో మనం చేసిన సేవే శాశ్వతంగా గుర్తుంటుందని కలెక్టర్ తెలిపారు. సమాజం కోసం పనిచేసే వారికి విలువ ఉంటుందని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదగడంతో పాటు ఇతరులకు సహాయం చేసే ఆలోచనతో ఉండాలని, మన గ్రామాలను,రాష్ట్రాలను బాగు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు చేయాల్సిన పనులు క్రమ పద్ధతి ప్రకారం పూర్తి చేయాలని అన్నారు. విద్యార్థి దశలో పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మన స్నేహితులు కూడా బాగా చదువుకునేలా ప్రోత్సహించాలని, అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదివితేనే గొప్ప విజయాలు సాధ్యమవుతాయని కలెక్టర్ అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ పాఠశాలలోని లైబ్రరీనీ పరిశీలించి ఆకర్షణీయంగా, పిల్లలను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, షూస్ కొరకు గతంలో కలెక్టర్ అందించిన లక్షా 50 వేలతో కొనుగోలు చేసిన స్పోర్ట్స్ డ్రెస్, షూస్ ను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం దాతలు కూతుంబాక మధు, కూరాకుల నాగభూషణం ను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్య కమిటీ చైర్ పర్సన్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు..

రెయిన్ బో విష్టాస్ రాక్ గార్డెన్ లో ఘనంగా వనభోజనాలు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రెయిన్ బో విష్టాస్ రాక్ గార్డెన్ కమ్యూనిటీలో సీనియర్ సిటిజన్స్ సంఘం ఎర్పడి అయిదు సంవత్సరాల సందర్భంగా బుధవారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాలకు తరలి వెళ్లారు. గత ఐదు సంవత్సరాలుగా అప్పటి నుండి క్రమం తప్పకుండ వెల్తున్నారు ఇది కాక వీరు ప్రతి మూడు నాలుగు మాసాలకు ఒకసారి అందరూ కలిసి ఒకరోజు విహారయాత్రలకు వెల్తుంటారు. అందరి జన్మదిన కార్యక్రమాలు వారి సంఘం గదిలో నిర్వహించుకుంటారు. చాలా మంది పిల్లలు విదేశాల్లో స్థిరపడ్డారు వీరు ఇక్కడ ఒంటరి అనే ఆలోచన లేకుండ అందరూ ఉల్లాసభరితంగా ఉంటారు. క్రమం తప్పకుండ హెల్త్ క్యాంపు లు కూడా కమ్యూనిటీ సంఘం పెద్ద పెద్ద ఆసుపత్రుల సహకారంతో నిర్వహిస్తుంటారు. రెయిన్బో విష్టాస్ రాక్ గార్డెన్ అధ్యక్షులు బండి. మధుసూదనరెడ్డి , సీనియర్ సిటిజన్ సభ్యులకు కావలసిన వసతులు సమకూరుస్తు వారిని మరింత ప్రోత్సాహిస్తున్నారు. ఆటల పోటీలు, పండుగలకు పౌరాణిక నాటకాలు ఇలా ఎప్పుడు ఏదో ఒకటి చేసుకుంటు అందరూ కలిసిమెలిసి ఆనందమైన శేష జీవితం గడుపుతున్నారు. సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు జయంత్ కుమార్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు, వెంకటరత్నం, రంగారావు, టి.యస్. రెడ్డి,డాక్టర్ చంద్రయ్య, అధ్యక్షులు కే.ఇంద్రారెడ్డి, గురునాథరెడ్డి, వెంకటరెడ్డి, ఆంజనేయులు, గుప్త, అశ్వత్థ్ నారాయణ, శివ నాగేశ్వరరావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

*** కొత్తగూడెం జిల్లా అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొత్తగూడెం జిల్లా అధికారులపై ఫైర్ అయ్యారు. కొత్తగూడెం జిల్లా పర్యటనకు బుధవారం వచ్చిన ఆయన అప్పటికప్పుడు పలు శాఖల అధికారులతో చుంచుపల్లిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వేటు తప్పదని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయన్నారు. పలు శాఖల అధికారులపై ఫిర్యాదులొస్తున్నాయని, అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులు నిర్వీర్యం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చింద వాటిని మంచి పనులకు వినియోగించాలని లేకపోతే శాఖపరమైన చర్యలుంటాయని సీపీవోను హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే రోడ్డు అభివృద్ధి పనులకు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను అలస్యం లేకుండా పొంది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఈలకు సూచించారు. గ్రామాల్లో పనిచేసే పంచాయతీ సెక్రటరీలు నివాసం ఓ చోట విధులు మరో చోట నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల్లో వారికి పట్టు ఉండటం లేదని వెంటనే ఆయా గ్రామాల సెక్రటరీలు వారు పనిచేస్తున్న గ్రామాలకు నివాసం మారాలని సూచించారు. వారిపై డీపీవో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీరు ఇతరత్రా సమస్యలేవీ లేకుండా చూడాలన్నారు. అలాగే జిల్లాలోని పలు మండలాల్లో ఎమ్మార్వోలపై వరుస ఫిర్యాదులందుతున్నాయని తెలిపారు. ఎమ్మార్వోలను పర్యవేక్షించే బాధ్యత ఆర్ డీ వో లదేనని సూచించారు. వారి పనితీరు ఎప్పటికప్పుడు తనకు అప్ డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. వాటి ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో మెరుగైన పనితీరు కోసం ఒక్కరికే రూ.50లక్షల ఆ పై టెండర్లు ఇవ్వాలన్నారు. తద్వారా అతని పై ఒత్తిడి పెంచి పనిని త్వరగా పూర్తి చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్ డ బ్ల్యూఎస్ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఆకస్మిక తనిఖీ చేస్తానని నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గమనిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పరిపాలన సజావుగా సాగేందుకు లోకల్ బాడీస్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకోని విధులు నిర్వర్తించాలన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ భద్రాద్రి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య బుధవారం ప్రకటించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ జరిగిన నూతన కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా అనిల్ (అశ్వారావుపేట), ప్రధాన కార్యదర్శిగా మర్రి కృష్ణ (కొత్తగూడెం), ఉపాధ్యక్షులుగా బడుగు భాస్కర్, విజ్జి, ఆరెల్లి కృష్ణ, పుట్ట లక్ష్మణ్, ముక్కెర లక్ష్మణ్, సహాయకార్యదర్శులుగా జోసెఫ్, బాబు జానీఖాన్, షాకీర్, అక్బర్ హుస్సేన్, ఆర్గనైసింగ్ కార్యదర్శులుగా కోటేశ్వర్ రావు, శివ, సురీంనేని జనార్దన్, వీర్ల దుర్గ, జలీల్ లను ఎన్నుకున్నట్లు జమలయ్య తెలిపారు, వీరితో పాటు 47మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు జమలయ్య తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలపై నూతన కమిటీ సభ్యులు స్పందిస్తూ వారి సమస్యల పరిస్కారంకోసం కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, బాతుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మాజీ ముఖ్యమంత్రి, బి ఆర్ ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని ఎర్రవెల్లి లోని తన వ్యవసాయ క్షేత్రం లో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.

రోడ్డు అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి

*** గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

ప్రజాస్ఫూర్తి,ఖమ్మం : రోడ్డు అభివృద్ధి పనులను పూర్తిగా నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి, కూసుమంచి మండలంలో పర్యటించి ముత్యాల గూడెం, చేగొమ్మ, జీళ్లచెరువు గ్రామాల్లో చేపట్టిన సి.సి.రోడ్డు,డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను సకాలంలో, నాణ్యతతో పూర్తి చేయాలని, పది కాలాల పాటు ఉండేలా పకడ్బందీగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి చిన్నారులకు పండ్లు పంపిణీ

ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం కుషాయిగూడ లోని అంగన్వాడి కేంద్రం చిన్నారులకు కుషాయిగూడ బిఆర్ఎస్ నాయకులు చల్ల వెంకటేష్, సారా అనిల్ ముదిరాజ్ పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయన పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడి పిల్లలకు పండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ భూమి పరుల పాలు..!

* ప్రభుత్వ భూమికి రక్షణ ఎక్కడ.?
* కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి కబ్జా....
* ప్రభుత్వ భూమిని కాపాడటంలో మండల తాసిల్దారు విఫలం...

ప్రజాస్ఫూర్తి,ఖమ్మం :ముదిగొండ మండలం సువర్ణపురం రెవిన్యూ పరిధిలోని న్యూ లక్ష్మిపురం గ్రామ సమీపంలో సర్వే నెంబర్ 417 లో ప్రభుత్వ భూమి 1:20 కలదు.ఈ భూమి వెంకటగిరి టు వల్లభి ప్రధాన రహదారి పక్కన ఉండడంతో భూమి రేటు కోట్ల రూపాయల విలువ చేస్తుంది. ఇదే అదనగా భావించి ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న సర్వే నెంబర్ 415 పట్టా భూమి గల ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి చుట్టూ పారి గోడను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇద్దరిలో ఒకరు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ హాస్పటల్ డాక్టర్ కావడం విశేషం.మరొకరు రాజకీయ పార్టీ అంత అండదండలతో ఇద్దరు కలిసి కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి రాజ భోగాలను అనుభవిస్తున్నారు.ప్రభుత్వ భూములు కాపాల్సిన అధికారులే పట్టించుకోకుండా అక్రమార్కులకు ప్రభుత్వ భూములు అంటగట్టే పనిలో ఉన్నారని ముదిగొండ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ భూములు పర్యవేక్షణ చేయాల్సిన తాసిల్దారు ప్రభుత్వ భూములు కాపాడటంలో విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు.ఇంత జరుగుతున్న అధికారులు ఏం చేస్తున్నారంటు మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడి, ఈ అక్రమానికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి మండల ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీ పలు వార్డులలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్ శేషాంజన్ స్వామి బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పలు వార్డులలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. 29వ వార్డులో కాలువలలో ఉన్న నల్ల పైపులను గుర్తించి వాటిని కాలువ పైన ఉండేలా చేపించారు ఈ సందర్భంగా నల్ల పైపులు కాలువలలో ఉండకుండా చూసుకోవాలని దానివల్ల చెత్త చెదారం నిలిచిపోతుందని దోమలు దుర్వాసన పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయని అంతే కాకుండా నల్ల పైపు రంధ్రం ఉండి ఉంటే కాలువలోని మురికి నీరు పైపు ద్వారా మంచినీటిలో చేరుతుందని, పరిసరాల పరిశుభ్రత పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నీలాద్రిపేట గుత్తి కోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కరకగూడెం మండలం నీలాద్రి పేట వలస గిరిజన గుత్తికొయ గ్రామంలో బుధవారం కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేశారు..ఆదర్శ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నీలాద్రి పేట గ్రామంలో నివసించే గ్రామస్తులకు దుస్తులు,బెడ్ షీట్స్,చాపలు,వాటర్ బాటిల్స్,డోర్ కర్టెన్స్,బ్యాగులను బుధవారం కరకగూడెం పోలీసులు పంచడం జరిగింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వలస గుత్తి కోయ గ్రామస్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం,అభివృద్ధి కొరకు పాటుపడాలనే ధ్యేయంతో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ లను నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు.అభివృద్ధి నిరోధకులైన నిషేధిత సిపిఐ మావోయిస్టులకు ఎలాంటి సహాయ,సహకారాలు అందించకూడదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు వారికి తెలియజేసి ఆ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు తో పాటు కరకగూడెం ఎస్సై రాజేందర్ , సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: హరికృష్ణ

చౌటుప్పల్,ప్రజాస్ఫూర్తి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశానుసారం అధికారులు ప్రభుత్వ హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల నిర్వహణ లో భాగంగా చౌటుప్పల్ తహసిల్దార్ హరికృష్ణ, అంగన్వాడి సూపర్వైజర్ సి.సువర్ణ తో కలిసి చౌటుప్పల్ మండల కేంద్రం లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్, బియ్యం స్టాక్ రిజిస్టర్, స్టాక్ రూమ్ పరిశుభ్రత, కూరగాయలు, వంట సామాగ్రి నాణ్యతలను తనిఖీ చేశారు. హాస్టల్ లోని మౌలిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యార్థుల భద్రత, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులతో పాటు,స్టాక్ రూమ్ లోని వస్తువులపై ఎక్స్పైరీ డేట్ లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను విద్యార్థులను, హాస్టల్ కేర్ టేకర్ మల్లికను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో విద్యార్థులకు అందుతున్న మెనూ, వసతులు, సదుపాయాలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వారి విద్యా ప్రమాణాలను పరిశీలించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవలంబించాల్సిన విషయ పరిజ్ఞానంపై తగిన సూచనలు, సలహాలను విద్యార్థులకు అందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారము విద్యార్థులకు భోజనం అందించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ సి సువర్ణ బాలికల హాస్టల్ లో రాత్రి బస చేశారు.

లండన్ లో ఘనంగా సదర్ ఉత్సవాలు జరిపిన హైదరాబాది వాసులు

ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్: ఈస్ట్ హమ్, లండన్ లో సదర్ ఉత్సవాలు యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సుమారు 170 మంది యాదవ్ అన్న చెల్లెల్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.లడ్డూ యాదవ్ మరియు స్వప్న యాదవ్ ప్రత్యేకంగా విడియో బైట్స్ ద్వారా వారీ యొక్క అభినందనలు తెలియచేసారు. ఈ యొక్క కార్యక్రమం ముఖ్యఅతిథిలు గా మాజీ తెలంగాణ ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్నాచలం, భారత జాగృతి మాజీ అధ్యక్షులు సుమన్ రావు బల్మూరి, బిఆర్ఎస్ ప్రెసిడెంట్ యూకే నవీన్ రెడ్డి , వారి టీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దీపావళి ఉత్సవాల్లో భాగంగా, దీపావళి ముగిసిన రోజున అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. దున్నపోతుల ఉత్సవంగా సదర్ ఉత్సవంగా పేరు గాంచింది. 'సదర్' అంటే హైదరాబాదీ వ్యవహారికం ప్రకారం 'ప్రధానమైనది' అని అర్థం. యాదవ కులస్తులు ఒక ప్రత్యేకమైన ప్రధాన ఉత్సవంగా ఈ సదర్‌ను నిర్వహించుకుంటారు. అలంకరించిన దున్నపోతులతో యువకులు కుస్తీ పట్టడం ఈ ఉత్సవ ప్రత్యేక విశేషం అని ఆన్నారు. అనంతరం ప్రశంత్ యాదవ్ మాట్లాడుతూ బిన్న సంస్కృతి, సంప్రదాయానికి తెలంగాణ పెట్టింది పేరు. ప్రతి ఏడాది దీపావళి పర్వదినం తర్వాత జంటనగరాలు మరో ఉత్సవానికి రెడీ అవుతాయి. దీపావళి పండుగ తర్వాత రోజు జరిగే సదర్ ఉత్సవాలు నగర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా అంగరంగ వైభవంగా యాదవ సామాజిక వర్గం వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. సదర్ ఉత్సవాల్లో పాల్గొనే దున్నపోతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా యాదవులు ముందుగా కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, డీజే మ్యూజిక్, యువకుల డ్యాన్సులు, కేరింతల మధ్య అందంగా ముస్తాబు చేసిన దున్నల విన్యాసాలు ఆకర్షణగా నిలుస్తాయి అని ఆన్నారు. కార్యక్రమానికి ఈస్ట్ హమ్ హైదరాబాద్ బావార్చి కిషోర్ మునగాల వారు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ ఆర్గనైజర్స్ లు రఘు యాదవ్, సత్యం యాదవ్, భాను యాదవ్,బసవయ్య యాదవ్, వెంకట కృష్ణ, కరుణ సాగర్ యాదవ్, దినేష్ యాదవ్, యువత, బాబు యాదవ్, కమలాకర్ యాదవ్,మల్లేష్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, మహేష్ యాదవ్, సంతోష్ యాదవ్, గురు యాదవ్, కార్తీక్ యాదవ్, స్వరూప్ యాదవ్,వీరా యాదవ్, నిశాంత్ యాదవ్,విజయ్ యాదవ్ లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు 2024 గోడ పత్రిక ఆవిష్కరణ

యాదాద్రి భువనగిరి, (ప్రజాస్ఫూర్తి) : యాదగిరిగుట్ట నవంబర్ 27 బుధవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో డిసెంబర్ 22 ఆదివారం తెలంగాణ యాదాద్రి రెడ్ల సంక్షేమ సంఘం హాల్ యాదగిరిగుట్ట నందు జాతీయ స్థాయి గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు 2024 గోడ పత్రికను హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ కార్యాలయంలో బీర్ల ఐలయ్య ప్రభుత్వ విప్ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇతర ప్రతినిధులతో కలిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గాంధీ 100 సంవత్సరాల క్రితం స్వదేశీ విజ్ఞానంతో స్వాలంబన దిశగా, స్వాభిమానంతో గ్రామ ప్రజలు అన్ని రంగాలలో జీవించాలని తమ యొక్క విజ్ఞానాన్ని ఆచరించి పుస్తకాల ద్వారా మనకు అందించాడు. అట్టి విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ వ్యవసాయదారులకు ముఖ్యంగా ప్రకృతిని పరిరక్షించి, ప్రజల ఆరోగ్యం కాంక్షించే విధంగా సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నటువంటి 115 మంది రైతు దంపతులకు పుడమిపుత్ర అవార్డులు , వ్యవసాయ అనుబంధ రంగాలలోసేవలు అందిస్తున్న వైద్యులకు, అధికారులకు, శాస్త్రవేత్తలకు, జర్నలిస్టులకు కిసాన్ సేవా రత్న పురస్కారాలు అందించడం అభినందనీయమని, గాంధీ విజ్ఞానం లో భాగంగా సుస్థిర విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, ఇంధన వనరులు, పర్యావరణం పై ప్రజలకు క్షేత్రస్థాయిలో అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్న ప్రదర్శనను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గ్రామ స్వరాజ స్థాపన కొరకు స్వదేశీ విజ్ఞానంతో స్వాలంబన దిశగా ప్రజలు సుభిక్షంగా సుస్థిర అభివృద్ధితో శాంతియుతమైన సమాజాన్ని ఏర్పాటు కొరకు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల డిసెంబర్ 22న యాదగిరిగుట్టలో చేస్తున్న కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చరక ప్రదర్శన, గ్రామ నిర్మాణ ఇంజనీర్ల ప్రదర్శన, మల్కంబ్ ,యోగా ప్రదర్శన, పురాతన, ఆధునిక వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల, దేశి విత్తనాల ,చిరుధాన్యాల ప్రదర్శన తోపాటు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ప్రారంభించనున్నట్లు చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, కార్యక్రమ కన్వీనర్ పడమటి పావని, రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ మెరుగు మధు, కాలసాని సంజయ్ రెడ్డి, గాలి రాంబాబు, బుర్ర దశరథ గౌడ్, మెరుగు సునీత చంద్రమోహన్, ఏలే బిక్షపతి, పి అర్దీప్ రెడ్డి, వాకిటి రామ్ రెడ్డి, బాలరాజు, మాటూరి అశోక్, పులి వెంకటేష్, ఎం అరుణ, సురేందర్ ,గాంధారి ప్రభాకర్ ,గూడూరు మదన్మోహన్ ,సిహెచ్ రాజకుమార్, కే సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించిన డీఈఓ

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి హై స్కూల్ లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా విద్యాధికారి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారంలో తప్పని సరిగా పోషక విలువలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ కిషన్, ప్రధానో పాధ్యాయులు నరేందర్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణతో చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరుతుంది

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : అయ్యప్ప నామస్మరణతో చేపట్టే ప్రతి పనిలో విజయం చేకూరుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ లో కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలోబుధవారం అయ్యప్ప మహా పడిపూజ అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ మహా పడి పూజ కు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ శ్రీ ధర్మశస్త్ర శరణం అయ్యప్పను కొలవడం ద్వారా ఈతిభాదలు తొలగి జీవితంలో సుఖశాంతులు చేకూరుతాయని అన్నారు. అనంతరం గాజులరామారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని హరిహరసుతుడు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం ఖాన్, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మూసా ఖాన్, ఇమ్రాన్ బెగ్, వాహీద్, సాయిబాబా, అసిఫ్, అజయ్ గుప్త, శివ కుమార్, నారాయణ్, బాబీ చౌదరి, చిన్నా చౌదరి, శాకీర్, మక్సుధ్ అలీ, శ్రవణ్, జునైధ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నగర్ స్మశాన వాటిక ను అభివృద్ధి పరచాలి

బాచుపల్లి సిపిఎం మండల కార్యదర్శి బి. వెంకట్రామయ్య

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రగతి నగర్ స్మశాన వాటిక ను అభివృద్ధి పరచాలని బాచుపల్లి సిపిఎం మండల కార్యదర్శి బి. వెంకట్రామయ్య అన్నారు. బుధవారం సిపిఎం నాయకులు ప్రగతి నగర్ స్మశాన వాటికను సందర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి సిపిఎం మండల కార్యదర్శి బి. వెంకట్రామయ్య మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడి సుమారు ఐదు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ స్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల స్మశాన వాటిక చెత్త డంపింగ్ యార్డ్ గా మారిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో అలసత్వం వహిస్తున్న మున్సిపల్ అధికారులు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్మశాన వాటికను వెంటనే శుభ్రం చేయించాలని నీటి సౌకర్యం కల్పించాలన్నారు. నిర్మించి ఉన్న రూములకు తలుపులు కిటికీలు ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యం కొరకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. స్మశాన వాటిక అసాంఘిక కార్యకలాపాలకు , మద్యపాన కేంద్రంగా మారిందని, ఇది అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దాదాపు 20 లక్షల రూపాయల నిధులు స్మశాన వాటికి అభివృద్ధి కోసం సిద్ధంగా ఉన్నాయని వివరించారు. స్మశాన వాటికని శుభ్రపరిచి నీటి సౌకర్యం కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం బాచుపల్లి మండల నాయకులు ఎం చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సంతోష్ , స్థానిక సిపిఎం నాయకులు జి వెంకటరాజ్యం,అక్బర్ అలీ ఖాన్, ఎస్ ప్రభాకర్, వి వి రావు, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై ప్రభుత్వం భరోసా కల్పించాలి

హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : సమాచార హక్కు చట్టంపై ప్రభుత్వం సామాన్య ప్రజలకు భరోసా కల్పించాలని బత్తుల మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ కార్యాలయంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ , రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ కాల క్రమేణ ఆర్టీఐ యాక్ట్ చట్టం అంతరించి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమాచారాన్ని వెల్లడించారు. సక్రమంగా జరగాల్సిన పనులు అడ్డదారిలో జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత అధికార యంత్రాంగంలో జవాబు దారి తనంతో ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల కాలంలో సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయా శాఖల పౌర సమాచార అధికారులతో జిల్లా కేంద్రంగా కమిషన్ కోర్టును ఏర్పాటుచేసి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కేసుల విచారణ ప్రక్రియ నిర్వహించి దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు గంగా ప్రియ రెడ్డి, లక్ష్మి ప్రియ యాదగిరి గౌడ్, వి.దయాకర్ రెడ్డి, జి.కుమార్ యాదవ్, లగ్గాని శ్రీనివాస్ గౌడ్,నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతులకు శుభవార్త 3 లక్షల మంది ఖాతాల్లోకి డబ్బులు !

తెలంగాణ రాష్ట్ర రైతులకు అదిరిపోయే శుభవార్త చెప్పారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రుణమాఫీ పై తాజాగా కీలక ప్రకటన చేయడం జరిగింది. ఎల్లుండి మూడు లక్షల మంది ఖాతాలలో రుణమాఫీ డబ్బులు వేస్తామని ఆయన ప్రకటించారు. పలు కారణాల వల్ల రుణమాఫీ నిలిచిన...మూడు లక్షల మంది రైతుల ఖాతాల్లోకి...డబ్బులు వేయబోతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడం జరిగింది. ఈనెల 30వ తేదీన 3 లక్షల మంది ఖాతాల్లో డబ్బులు వేస్తామని...హామీ ఇచ్చారు తుమ్మల నాగేశ్వరరావు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తారని చెప్పడం జరిగింది. వరి ధాన్యం దిగుబడి చేయడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తు చేశారు. తెలంగాణలో పండిన పాడి పంటలు మలేషియా అలాగే పిలిప్పిన్స్ దేశాలకు కూడా వెళ్తున్నాయని.. వెల్లడించారు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

బుడ్డా గౌరీ శంకర్ గౌడ్ కు నివాళ్ళులర్పించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జగద్గిరిగుట్ట , (ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత నేత బుడ్డా లింగం గౌడ్ తనయుడు, రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్ సోదరులు బుడ్డా గౌరీ శంకర్ గౌడ్ దశదిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం చింతల్ చంద్ర నగర్ లోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తో పాటు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరీ శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని నివాళ్ళులర్పించారు.

రాజాపేట మండలం లో జేసీ ఆకస్మిక సందర్శన

రాజాపేట, (ప్రజాస్ఫూర్తి) : రాజపేట మండలాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయాన్ని, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, బసంతాపురం పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. తహసిల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిస్థితిని పరిశీలించారు. కార్యాలయంలోని అన్ని గదులను ఆయన సందర్శించి అనంతరం గంటపాటు కార్యాలయాల అధికారులు ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. తగు సూచనలు ఇచ్చారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి సలహాలు ఇచ్చారు. వివరాలను తహసీల్దార్ దామోదర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రేణికుంట ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆ సమయంలో వ్యవసాయ అధికారిని పద్మజ అందుబాటులో లేకపోవడంతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇప్పటి వరకు 1,30,000 ధాన్యం బస్తాలు రైతుల నుండి కొనుగోలు చేసినట్లు జెసికి చెప్పారు. ఆ తర్వాత బసంతాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నీళ్ల చారు, కూరలో ఎక్కువ కారం ఉండడాన్ని విద్యార్థుల ద్వారా తెలుసుకొని వంటలు మంచిగా ఉండాలని జెసి సూచించారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య ఇతర వివరాలను ప్రధానోపాధ్యాయురాలు శైలజ ద్వారా అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. విద్యాబోధన విషయంలో అలక్ష్యం చేయరాదని అన్నారు. సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. జెసి వెంట తహసిల్దార్ దామోదర్, నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర రెడ్డి, ఆర్ఐలు రమేష్, నర్సింలు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలంటే సామాజిక భాగస్వామ్యం ఎంతో కీలకం

*** జిల్లా పాలనాధికారి జితేష్. వి.పాటిల్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బాల్య వివాహాలను నిర్మూలించాలంటే సామాజిక భాగస్వామ్యం ఎంతో కీలకమని అందుకు అందరం కలిసి బాల్య వివాహాలను చేయము ప్రోత్సహించము అని ప్రతిజ్ఞ కోణాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ఆలయన్స్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాల్వంచ లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు.బుధవారం దేశవ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనకై అన్ని జిల్లాల్లో ఒకేసారి ప్రతిజ్ఞ చేస్తున్నారని ఇది బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం అని అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని బాల్య వివాహం అనేదే లేని సూర్యపేటకై నిరంతరం శ్రమించాలని కోరారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి గొల్లపూడి భానుమతి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని పారాలిగల్ వాలంటీర్ల ద్వారా బాలలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అంబేద్కర్, సాదిక్ పాషా మాట్లాడుతూ బాల్య వివాహం అనేది చట్టరీత్యా నేరము దీనికి పాల్పడిన వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుంది అని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి లెనినా మాట్లాడుతూ సంక్షేమ శాఖ ద్వారా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాల బాలికల శ్రేయస్సుకై అనేక రకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. జి సి డి ఓ అన్నామణి మాట్లాడుతూ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని వ్యక్తిగత శుభ్రత పాటించాలని బాలికలు అందరూ చదువులలో, ఆటలలో రాణించాలని నేటి బాలలే రేపటి పౌరులని మీ మేధస్సు దేశానికి ఎంతో అవసరం అని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరి కుమారి మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ద్వారా బాలలకు అన్ని రకాల సేవలను అందిస్తున్నామన్నారు. ఎయిడ్ సంస్థ కోఆర్డినేటర్ రాజేష్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా గత రెండున్నర సంవత్సరాలుగా బాల్య వివాహాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ తల్లిదండ్రులకు బాల బాలికలకు ప్రజలకు బాల్య వివాహాలు చేయడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ వారి పిల్లలు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు అన్నపూర్ణాదేవి కారు బాల్య వివాహ ముక్త్ భారత్ అనే క్యాంపెయిన్ను ప్రారంభించినట్లు తెలిపారు. అందులో భాగస్వాములు అవ్వడం ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలు మరువలేనివని అన్నారు. అనంతరం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో ప్రతిజ్ఞ జరిగే సమయంలోనే బాల బాలికలు అందరి చేత కలెక్టర్ బాల్య వివాహ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏఐడీ సంస్థ కోఆర్డినేటర్ రాజేష్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు సాదిక్ పాషా, అంబేద్కర్,జిల్లా సంక్షేమ అధికారిని లెనిన్, జి సి డి ఓ అన్నామని, సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న, డి సి పి ఓ హరి కుమారి, కేజీబీవీ ప్రత్యేక అధికారిని తులసి, సీనియర్ అడ్వకేట్ మెండు రాజమల్లు, ఏఐడీ కుటుంబరావు, శేఖర్, మోహన్, జ్యోతి, 1098 టీం, సఖి వన్ స్టాప్ సెంటర్ టీం, డిస్టిక్ హబ్ టీం, అంగన్వాడీలు , ఆశా వర్కర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడేది టీడబ్ల్యూజేఎఫ్

టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎంపల్లి పద్మా రెడ్డి

ప్రజాస్ఫూర్తి, కాప్రా : జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, జర్నలిస్టుల పక్షాన నిలిచిన ఏకైక జర్నలిస్టుల సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మాత్రమే అని జాతీయ కౌన్సిల్ సభ్యులు వేంపల్లి పద్మారెడ్డి అన్నారు. ట్రేడ్ యూనియన్ గా కార్మిక శాఖలో నమోదై ప్రభుత్వ గుర్తింపు పొందిన, టీడబ్ల్యూజేఎఫ్ లో సభ్యులుగా చేరే జర్నలిస్టులకు సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల రక్షణ బాధ్యతగా టిడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తున్నదని, యూనియన్ లో చిన్న, పెద్ద భేదం లేకుండా, ప్రతి జర్నలిస్టుకు సభ్యత్వం, సమానత్వం కల్పించడం జరుగుతుందని అన్నారు. మేడ్చల్ జిల్లా టిడబ్ల్యుఎఫ్ కోశాధికారి బెల్ది అశోక్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన ఉప్పల్ నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మహాసభ కుషాయిగూడ లో జరుగుతుందని, ఈ మహాసభలో గత కార్యక్రమాలు సమీక్షించుకొని, భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకుంటామని, నూతన కమిటీని ఏర్పాటు చేసుకుంటామని వారు తెలిపారు. ఈ మహాసభకు టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కే సలీమా, తన్నీరు శ్రీనివాస్ తదితరులు హాజరవుతారన్నారు. కావున ఉప్పల్ నియోజకవర్గం లోని జర్నలిస్టులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పటేల్ నర్సింహులు, యావపురం రవి, సభ్యులు కె.వెంకటేష్, రామచంద్రమూర్తి, డి.శ్రీనివాసరావు, నిరంత్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం సమగ్ర సర్వే ప్రజలు సహకరించాలి

- బి సందీప్ కుమార్

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చౌటుప్పల్ మండలంలో 98శాతం పూర్తి జరిగిందని ఎంపీడీవో బి. సందీప్ కుమార్ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ప్రారంభించిన సర్వేలో మొత్తం 103మంది ఏన్యుమరేటర్లు 14,482వరకు ఇండ్లను సందర్శించి ఆయా కుటుంబాలకు సంబంధించి సమగ్రంగా సామాజిక ఆర్థిక ఉపాధి విద్యా రాజకీయ, కుల వివరాలకు సంబంధించి నటువంటి అన్ని గణాంకాలను సేకరించారని తెలిపారు. అందులో భాగంగా సమగ్ర సర్వే సుమారుగా 98శాతం పూర్తి అయింది. మండలంలోని గ్రామపంచాయతీలలో, ఆవాస ప్రాంతాల్లో ఎవరైనా సర్వే నిర్వహణకు సంబంధించిన అధికారులు మీ వద్దకు రాకున్నా, అదేవిధంగా మీరు అందుబాటులో లేకపోవడం లేదా మీ ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భంలో గానీ సర్వేలో నమోదు కానీ కుటుంబాల వారు 100శాతం నమోదు కొరకు అందరు సహకరించాలని కోరారు. ఇందులో మిగిలిన కుటుంబాలు ఎవరైనా దయచేసి మీ సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శికి లేదా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నోడల్ అధికారి/మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం 9281489557ఫోన్ నంబర్ ద్వారా లేదా ప్రత్యక్షంగా గ్రామపంచాయతీ కార్యాలయం సంప్రదించి కుటుంబాన్ని సమగ్ర సర్వేలో నమోదు చేయించుకోవాల్సిందిగా తెలియజేశారు.

చలికాలంలో ఎనర్జీ ఇచ్చే రాగి సూప్ ఇలా చేసుకోండి..!

ప్రస్తుతం చలి చంపేస్తోంది. పొద్దున్నే చలి గాలుల దెబ్బకి దుప్పటి తీయబుద్ధి కావట్లేదు చాలామందికి. ఆఫీసులకు,పనులకు వెళ్లడం తప్పనివాళ్లకి మాత్రం నిద్రలేవక తప్పదు. అయితే చలికాలంలో పొద్దున్నే నిద్రలేవగానే వేడివేడిగా ఏదైనా తాగాలని చాలామంది కోరుకుంటారు. కొందరు టీ,కాఫీ వంటివి తాగుతుంటారు. మరికొందరు వేడివేడి సూప్ లను తాగేందుకు ఇష్టపడతారు. ఆరోగ్యానికి ప్రయోజనం కలిగించే అనేక రకాల సూప్ లు ఉన్నప్పటికీ అందులో రాగి సూప్ లెక్కే వేరు. మన పూర్వీకులు రాగి సూప్ వంటివి బ్రేక్ ఫాస్ట్ గా తీసుకునేవాళ్లు. అందుకే అంత ఆరోగ్యంగా స్ట్రాంగ్ గా ఉండేటోళ్లు. చాలా చవకగా,చాలా ఈజీగా తయారు చేసుకోగలిగే వంటల్లో రాగి సూప్ ఒకటి. ఖర్చు తక్కువ,ఆరోగ్యానికి ప్రయోజనం ఎక్కువ కలిగించే రాగి సూప్ ని ఇంట్లోనే చాలా ఈజీగా ఎలా చేసుకోవాలి,దీని తయారీకి ఏం కావాలి వంటి వివరాలు ఇక్కడ చూడండి.

రాగి సూప్ తయారీకి కావాల్సినవి

1 కప్పు రాగి పిండి
1 టీస్పూన్ సన్నగా తరిగిన పచ్చిమిర్చి
1 కప్పు క్యారెట్,బీన్స్,స్వీట్ కార్న్ అన్నీ కలిపి
కొన్ని సన్నగా తరిగిన ఉల్లిపాయలు
1 స్పూన్ నెయ్యి
1 టీస్పూన్ సన్నగా తరిగిన అల్లం,వెల్లుల్లి
పావు కప్పు చిలికిన పెరుగు
రుచికి సరిపడా ఉప్పు
1/2 స్పూన్ మిరియాల పొడి

రాగి సూప్ తయారు చేసే విధానం

ఫస్ట్ ఓ బౌల్ లో రాగి పండిని తీసుకోవాలి.అందులో ఒక గ్లాస్ రాగి పిండి తీసుకుంటే రెండు గ్లాస్ ల నీళ్లు పోయాలి. అంటే పిండి ఎన్ని గ్లాస్ లు తీసుకునే రెట్టింపు వాటర్ పోయాలి అన్నమాట.
నీళ్లు పోసిన తర్వాత రాగిపిండి ఉండలు లేకుండా బాగా కలపి పక్కన పెట్టుకోండి
ఇప్పుడు కూరగాయలను సన్నగా కట్ చేసుకుని అన్నింటిని 1 కప్పు వచ్చేలా కలిపి సిద్ధంగా ఉంచుకోండి.
పొయ్యి మీద పాన్ పెట్టి అందులో నెయ్యి వేసి వేడి చేయాలి.
నెయ్యి వేడెక్కాక అందులో అల్లం, వెల్లుల్లి, సన్నగా తరిగిన పచ్చిమిర్చి వేసి వేయించాలి.
ఆ తర్వాత క్యారెట్,స్వీట్ కార్న్,బీన్స్ లాంటి ఏదైనా మీకు నచ్చిన మిక్స్డ్ వెజిటేబుల్స్ వేసి వేయించాలి.
సన్నగా తరిగిన ఉల్లిపాయలు కూడా వేసి కూరగాయలు సగం ఉడికేంత వరకు ఫ్రై చేయాలి. ఆ తర్వాత అర కప్పు నీళ్లు పోసి కూరగాయలను కాసేపు ఉడికించాలి.
కూరగాయలు ఉడికేటప్పుడు కొంచెం ఉప్పు వేసి బాగా కలుపుతూ వేగించాలి.
ఇప్పుడు కలిపిపెట్టుకున్న రాగి మిశ్రమాన్ని అందులో పోసి కాసి ఉడకబెట్టి పొయ్యి ఆపెయ్యండి.
వేడి తగ్గాక అందులో పావు కప్పు చిలికిన పెరుగు కలపండి.
ఆ తర్వాత మీ రుచికి తగినంత ఉప్పు, కొంత మిరియాల పొడిని కలుపుకుంటే హెల్తీ వెజ్ రాగి సూప్ రెడీ.

శీతాకాలంలో ఈ ఫుడ్ తినండి

శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. చలికాలంలో వృద్ధులే కాదు యువత కూడా అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొన్నిసార్లు చర్మం చాలా పొడిగా మారుతుంది. అంతే కాకుండా కొన్నిసార్లు మోకాళ్లలో నొప్పి మొదలవుతుంది. అదే సమయంలో, జలుబు , దగ్గు చాలా సాధారణం మారతాయి. మహిళలు ఎక్కువగా వెన్నునొప్పి సమస్యతో పోరాడటం చేస్తుంటారు. చలికాలంలో ఇలాంటి ఆరోగ్య సంబంధిత సమస్యలు రాకుండా ఉండాలంటే, ఖచ్చితంగా ఈ 6 రకాల ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోండి. ఇవి మీ శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మరి మీరు చలికాలంలో జలుబుకు దగ్గులతో పాటు ఇతర సమస్యల నుంచి దూరంగా ఉండాలనుకుంటే . మీ ఆహారంలో ఖచ్చితంగా చేర్చుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

దేశీ నెయ్యి

చలికాలంలో రోటీ లేదా అన్నంలో ఒక చెంచా దేశీ నెయ్యి వేసుకుని తినాలి. ఇంట్లో తయారుచేసిన స్వచ్ఛమైన దేశీ నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి కీళ్లను లూబ్రికేట్ చేయడంలో, శరీరాన్ని వెచ్చగా ఉంచడంతో పాటు చలి నుండి రక్షించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా నెయ్యిలో ఉండే కొవ్వు కరిగించి తక్షణ శక్తిని అందిస్తాయి.

చిలగడదుంపలు

చలికాలంలో లభించే చిలగడదుంపలను తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఇవి మార్కెట్‌లో కనిపిస్తే తప్పకుండా కొనుక్కుని అల్పాహారంగా తినండి. బత్తాయిలో ఫైబర్, విటమిన్ ఎ, పొటాషియం ఉంటాయి. ఇది మలబద్ధకం, చలికాలంలో కడుపులో వచ్చే మంటను దూరం చేస్తుంది. అంతే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది.

గూస్బెర్రీ

ఉసిరి యొక్క ఆరోగ్య ప్రయోజనాల గురించి దాదాపు అందరికీ తెలుసు. రోజువారీ ఆహారంలో దీన్ని తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. అంతేకాకుండా, చర్మం, జుట్టు కూడా అందంగా మారతాయి. విటమిన్ సి పుష్కలంగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. ఉసిరి చట్నీ, ఊరగాయ లేదా రసం తీసి త్రాగాలి. ఉసిరికాయను తినడానికి ఈ మూడు మార్గాలు చాలా ఆరోగ్యకరమైనవి.

బెల్లం , ఖర్జూరం

కీళ్లనొప్పులు , ఎముకలు , కీళ్లలో నొప్పితో బాధపడుతుంటే, మీ రోజువారీ ఆహారంలో బెల్లం, ఖర్జూరాన్ని చేర్చుకోండి. వీటిలో ఖనిజాలు, ఫైబర్ , విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఊపిరితిత్తులను కాలుష్యం నుండి రక్షించుకోవడానికి బెల్లం తినడం అత్యంత ఆరోగ్యకరమైన మార్గం. మీ రోజువారీ ఆహారంలో తప్పకుండా బెల్లాన్ని చేర్చుకోండి.

మిల్లెట్ , రాగి

మీ ఆహారంలో మిల్లెట్లను తప్పకుండా తినండి. ఈ గింజల్లో పీచు సమృద్ధిగా ఉండటమే కాకుండా గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఇది ఇన్ఫెక్షన్‌ను నయం చేస్తుంది . అంతే కాకుండా కీళ్లను బలపరుస్తుంది. చలికాలంలో లభించే ధాన్యాలను తప్పనిసరిగా రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

ఆవాలు

ఆవాలు, మొక్కజొన్న రోటీలు తినడం రుచికే కాదు ఆరోగ్యానికి కూడా ముఖ్యం. శరీరాన్ని వెచ్చగా ఉంచడమే కాకుండా ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.



బీపీ రావడానికి కారణాలు ఇవే..!

బీపీ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్లు వంటి కారణాల వల్ల బీపీ వస్తోంది. అధిక రక్తపోటుకు 10 సాధారణ కారణాలు లేదా ప్రమాద కారకాలు ఇక్కడ ఉన్నాయి.

1. జన్యుశాస్త్రం, కుటుంబ చరిత్ర

అధిక రక్తపోటు యొక్క కుటుంబ చరిత్ర రక్తపోటును అభివృద్ధి చేసే సంభావ్యతను పెంచుతుంది. శరీరం రక్తపోటును ఎలా నియంత్రిస్తుంది అనే దానిపై జన్యుపరమైన అంశాలు ప్రభావం చూపుతాయి.

2. వయస్సు

అధిక రక్తపోటు వయస్సుతో చాలా సాధారణం అవుతుంది, ముఖ్యంగా పురుషులలో 45 మరియు స్త్రీలలో 65 సంవత్సరాల తర్వాత రక్తపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వయస్సు పెరిగేకొద్దీ, వారి రక్త నాళాలు దృఢంగా మారతాయి, ఇది అధిక రక్తపోటుకు దోహదం చేస్తుంది.

3. ఊబకాయం మరియు అధిక బరువు

అధిక శరీర బరువు గుండె మరియు రక్త నాళాలపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది రక్తపోటు పెరుగుదలకు దారితీస్తుంది. కొవ్వు కణజాలం కూడా శరీరంలో ఉప్పును నిలుపుకునేలా చేస్తుంది, ఇది రక్తపోటును పెంచుతుంది.

4. శారీరక నిష్క్రియాత్మకత

నిశ్చల జీవనశైలి అధిక రక్తపోటుకు ప్రధాన ప్రమాద కారకం. రెగ్యులర్ వ్యాయామం ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది మరియు మెరుగైన గుండె పనితీరును ప్రోత్సహిస్తుంది, ఇది రక్తపోటును తగ్గిస్తుంది.

5. ఆహారం (అధిక ఉప్పు తీసుకోవడం)

సోడియం (ఉప్పు) అధికంగా ఉన్న ఆహారం శరీరంలో ద్రవాన్ని నిలుపుకునేలా చేస్తుంది, ఇది రక్త పరిమాణంలో పెరుగుదలకు దారితీస్తుంది, ఇది రక్తపోటును పెంచుతుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలలో తరచుగా సోడియం ఎక్కువగా ఉంటుంది.

6. మితిమీరిన ఆల్కహాల్ వినియోగం

పెద్ద మొత్తంలో లేదా తరచుగా మద్యం సేవించడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అధిక మద్యపానం గుండె కండరాలను కూడా దెబ్బతీస్తుంది మరియు మరిన్ని సమస్యలకు దారితీస్తుంది.

7. క్రానిక్ కిడ్నీ డిసీజ్

ద్రవ సమతుల్యతను నియంత్రించడం మరియు హార్మోన్లను ఉత్పత్తి చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు (వ్యాధి లేదా ఇతర పరిస్థితుల వల్ల), అవి సరిగ్గా పనిచేయకపోవచ్చు, ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది.

8. ఒత్తిడి

దీర్ఘకాలిక ఒత్తిడి రక్తపోటులో తాత్కాలిక స్పైక్‌లకు దారితీస్తుంది. అదనంగా, ఒత్తిడి అతిగా తినడం, ధూమపానం లేదా మద్యపానం వంటి అనారోగ్య ప్రవర్తనలను ప్రోత్సహిస్తుంది, ఇది రక్తపోటుకు దోహదం చేస్తుంది.

9. ధూమపానం

ధూమపానం రక్త నాళాలను దెబ్బతీస్తుంది, ధమనులను తగ్గిస్తుంది మరియు హృదయ స్పందన రేటును పెంచుతుంది, ఇవన్నీ రక్తపోటును పెంచుతాయి. సిగరెట్‌లోని నికోటిన్ రక్తపోటును తాత్కాలికంగా పెంచుతుంది.

10. స్లీప్ అప్నియా

అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, ఇక్కడ నిద్రలో వాయుమార్గం నిరోధించబడుతుంది, అధిక రక్తపోటుతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది ఆక్సిజన్ స్థాయిలలో అడపాదడపా పడిపోతుంది, హృదయ స్పందన రేటు మరియు రక్తపోటు పెరుగుదలను ప్రేరేపిస్తుంది.

హోండా నుంచి సరికొత్తగా యాక్టివా ఈవీ..

ఫీచర్లు చూస్తే అదిరిపోవాల్సిందే!

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలని అనుకునే వారికి గుడ్‌న్యూస్. ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హోండా మోటార్స్ ఇప్పుడు సరికొత్తగా ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొస్తోంది. హోండా యాక్టివా ఈ, క్యూసీ 1 పేరిట రెండు ఎలక్ట్రిక్ స్కూటర్‌లను విపణిలోకి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో ఆ రెండు ఈవీ స్కూటర్లను ఇవాళ ప్రదర్శించారు.

హోండా యాక్టివా ఈవీ.. రెగ్యులర్ యాక్టివా మోడల్ కంటే కొంచెం భిన్నంగా ఉంది. ఎల్ఈడీ హెడ్ ల్యాంప్‌తో పాటు సైడ్ ఇండికేటర్ల విషయంలో స్వల్ప మార్పులు చేశారు.ఇది స్వాపబుల్ బ్యాటరీతో వస్తుంది. ఇందులో రెండు 1.5 కిలోవాట అవర్ బ్యాటరీలను అమర్చారు. ఈ స్కూటర్ సింగిల్ ఛార్జ్‌తో 102 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. గరిష్టంగా గంటకు 80 మీటర్ల వేగంతో వెళ్లవచ్చు. స్టాండర్డ్, స్పోర్ట్స్, ఎకానమీ మోడ్‌లలో హోండా యాక్టివా ఈవీ అందుబాటులోకి రానుంది.

హోండా క్యూసీ 1ను తక్కువ దూరం ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశారు. ఇది 1.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. సింగిల్ చార్జ్‌తో 80కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. గరిష్టంగా గంటకు 50 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. ఈ రెండు ఈవీ స్కూటర్లకు సంబంధించిన ధరలు మాత్రం ఇంకా ప్రకటించలేదు. కాకపోతే వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి వీటి బుకింగ్స్‌ను ప్రారంభించనున్నారు. అప్పుడే ధరల వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

ఉచితంగా ఆధార్ కార్డు అప్‌డేట్..

గడువు దాటిందంటే చార్జీల మోతే

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు ద్వారా ప్రతి ఒక్కరికీ 12 అంకెల నంబర్ ను కేటాయిస్తారు. చిరునామాతో పాటు ఐరిస్, వేలిముద్రలు తదితర బయోమెట్రిక్ సమాచారం దానిలో ఉంటుంది. కాబట్టి ఆధార్ కార్డులో వివరాలన్నీ సక్రమంగా దోషరహితంగా ఉండేలా చూసుకోవాలి. ఉద్యోగం, వ్యాపారం రీత్యా వేరే ప్రాంతాలకు మారిన వారు ఆధార్ కార్డులోని తమ చిరునామాకు తప్పకుండా మార్చుకోవాలి. అలాగే సొంత ఊరిలోనే ఉన్నవాళ్లు, కార్డులో వివరాలన్నీ సక్రమంగా ఉన్నవారు కూడా ప్రతి పదేళ్లకు కార్డును అప్ టేడ్ చేసుకోవాలి.

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఈ మేరకు ఆధార్ కార్డు హెూల్డర్లకు ఆదేశాలు జారీ చేసింది. పదేళ్లకు మించి కార్డును అప్ డేట్ చేయనివారు వెంటనే చేసుకోవాలని సూచించింది. వివరాలను ఉచితంగా నవీకరణ చేసుకోవటానికి ఈ ఏడాది డిసెంబర్ 14 వరకూ అవకాశం కల్పించింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ లో పోస్టు చేసింది. కోట్ల మందికి ప్రయోజనం చేకూర్చే ఈ ఉచిత సేవ మైఆధార్ పోర్టల్ లో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ గడువు దాటితే నిర్ణీత చార్జీలతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఆధార్ కార్డు అనేది అత్యంత ముఖ్యమైన పత్రం కావడంతో దాన్ని సమగ్రంగా, తప్పులు లేకుండా ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల నకిలీల బెడద తప్పుతుంది. అందుకోసమే ఉచిత అప్ డేట్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. పదేళ్ల తర్వాత రికార్డులను అప్ డేట్ చేసుకోవడం వల్ల మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగపడతుంది. ఆధార్ ను ఆన్ లైన్ లో నవీకరణ చేసుకోవడానికి ఈ కింద తెలిపిన సులభ పద్ధతులు పాటించొచ్చు.

దేశీయ సూచీలకు లాభాల జోరు..

భారీ లాభాల్లో అదానీ షేర్లు..

ముంబై: కొద్ది రోజులుగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటూ భారీ నష్టాలను చవిచూసిన అదానీ షేర్లు తిరిగి పుంజుకున్నాయి. అదానీకి చెందిన చాలా సంస్థల షేర్లు అప్పర్ సర్క్యూట్‌కు చేరుకున్నాయి. బుధవారం ఒక్కరోజే అదానీ గ్రూప్ కంపెనీల విలువ 90 వేల కోట్లకు పైగా పెరిగింది. అదానీ షేర్లు రాణింపుతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలు అందుకున్నాయి

దేశీయ సూచీలు బుధవారం లాభాల బాటలో పయనించాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు కొంత ఒడిదుడుకులు ఎదుర్కొని లాభాల్లోనే రోజును ముగించాయి. మరోవైపు కొద్ది రోజులుగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటూ భారీ నష్టాలను చవిచూసిన అదానీ షేర్లు తిరిగి పుంజుకున్నాయి. అదానీకి చెందిన చాలా సంస్థల షేర్లు అప్పర్ సర్క్యూట్‌కు చేరుకున్నాయి. బుధవారం ఒక్కరోజే అదానీ గ్రూప్ కంపెనీల విలువ 90 వేల కోట్లకు పైగా పెరిగింది. అదానీ షేర్లు రాణింపుతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలు అందుకున్నాయి .

మంగళవారం ముగింపు (80, 0049)తో పోల్చుకుంటే 100 పాయింట్లకు పైగా లాభంతో 80, 121 వద్ద బుధవారం ఉదయం మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్తా ఒడిదుడుకులను ఎదుర్కొంది. మధ్యాహ్నం వరకు లాభనష్టాలతో దోబూచులాడింది. 79, 844 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. అలాగే ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడి 80, 511 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు 230 పాయింట్ల లాభంతో 80, 234 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 80 పాయింట్ల లాభంతో 24, 274 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్, వొడాఫోన్ ఐడియా, అదానీ పోర్ట్స్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాలు అందుకున్నాయి. ఇప్కా ల్యాబ్స్, గోద్రేజ్ ప్రాపర్టీస్, డాక్టర్ లాల్‌పాథ్ ల్యాబ్స్, గ్యాస్సుయల్స్ ఇండియా షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 357 పాయింట్ల లాభంతో ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ 110 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 84.45గా ఉంది.

ముగిసిన ఐపీఎల్ మెగా వేలం

రూ.639.15 కోట్లు ఖర్చుచేసిన ఫ్రాంచైజీలు

మార్చి 14 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభం

జెద్దా: సౌదీ అరేబియాలోని జెద్దా నగరంలో ఐపీఎల్ 2025 మెగా వేలం రెండు రోజుల పాటు విజయవంతంగా జరిగింది. ఈ భారీ ఈవెంట్‌లో మొత్తం 577 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా, 182 మంది ఆటగాళ్లు వేలంలో అమ్ముడయ్యారు. మరో 395 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు ఎంచుకోలేదు. 8 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు రైట్ టు మ్యాచ్ కార్డుతో తనవారిని ఎంచుకున్నాయి. ఈ వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.639.15 కోట్లు ఖర్చు చేశాయి. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషబ్ పంత్‌ను అత్యధికంగా రూ.27 కోట్లకు కొనుగోలు చేశారు. ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 14 నుంచి ప్రారంభమవనుంది. ఈ సీజన్‌లో ఫ్రాంచైజీలు తీసుకున్న కొత్త ఆటగాళ్లతో జట్లు మరింత బలంగా కనిపిస్తున్నాయి.

చెన్నై సూపర్ కింగ్స్ జట్టు

నూర్ అహ్మద్ (10 కోట్లు), రవిచంద్రన్ అశ్విన్ (9.75కోట్లు), డెవాన్ కాన్వే (6.25 కోట్లు)

ఖలీల్ అహ్మద్ (4.8 కోట్లు) రచిన్ రవీంద్ర (4 కోట్లు, అన్షుల్ కంబోజ్ (3.4 కోట్లు) రాహుల్ త్రిపాఠి (3.4 కోట్లు) సామ్ కర్రన్ (2.4 కోట్లు) గుర్జప్నీత్ సింగ్ (2.2 కోట్లు) నాథన్ ఇల్లిస్ (2 కోట్లు)

దీపక్ హుడా (1.7 కోట్లు) జేమీ ఓవర్టన్ (1.5 కోట్లు) విజయ్ శంకర్ (1.2 కోట్లు) వన్ష్ బేడీ (55 లక్షలు) ఆంద్రే సిద్దార్థ్ (30 లక్షలు) శ్రేయస్ గోపాల్ (30 లక్షలు)

రామకృష్ణ ఘోష్ (30 లక్షలు) కమలేశ్ నాగర్‌కోటి (30 లక్షలు) ముకేశ్ చౌదరీ (30 లక్షలు) షేక్ రషీద్ (30 లక్షలు)

ఢిల్లీ క్యాపిటల్స్

కేఎల్ రాహుల్ (14 కోట్లు) మిచెల్ స్టార్క్ (11.75 కోట్లు) టి నటరాజన్ (10.75 కోట్లు) జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (9 కోట్లు,) ముకేశ్ కుమార్ (8 కోట్లు, %¬వీ%) హ్యారీ బ్రూక్(6.25 కోట్లు)

అషుతోశ్ శర్మ (3.8 కోట్లు) మోహిత్ శర్మ (2.2 కోట్లు) ఫాఫ్ డుప్లెసిస్ (2 కోట్లు) సమీర్ రిజ్వి (95 లక్షలు) డొనొవన్ ఫెరియెరా (75 లక్షలు) దుష్మంత చమీరా (75 లక్షలు)

విప్రాజ్ నిగమ్ (50 లక్షలు) కరుణ్ నాయర్ (50 లక్షలు) మాధవ్ తివారి (50 లక్షలు) త్రిపురణ విజయ్ (30 లక్షలు) మాన్వంత్ కుమార్ (30 లక్షలు) అజయ్ మండల్ (30 లక్షలు) దర్శన్ నల్కండే (30 లక్షలు)

గుజరాత్ టైటాన్స్

జోస్ బట్లర్ (15.75 కోట్లు) సిరాజ్ (12.25 కోట్లు) రబాడ (10.75 కోట్లు) ప్రసిద్ధ్ కృష్ణ (9.5 కోట్లు) వాషింగ్టన్ సుందర్ (3.2 కోట్లు) షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (2.6 కోట్లు) గెరాల్డ్ కొయెట్జీ (2.4 కోట్లు)

గ్లెన్ ఫిలిప్స్ (2 కోట్లు) సాయి కిషోర్ (2 కోట్లు,) మహిపాల్ లోమ్రార్ (1.7 కోట్లు) గుర్నూర్ సింగ్ బ్రార్ (1.3 కోట్లు) అర్షద్ ఖాన్ (1.3 కోట్లు) కరీమ్ జనత్ (75 లక్షలు)

జయంత్ యాదవ్ (75 లక్షలు) ఇషాంత్ శర్మ (75 లక్షలు) కుమార్ కుషాగ్రా (65 లక్షలు) మానవ్ సుతార్ (30 లక్షలు) కుల్వంత్ కేజ్రోలియా (30 లక్షలు) అనూజ్ రావత్ (30 లక్షలు) నిషాంత్ సింధు (30 లక్షలు)

కోల్‌కతా నైట్ రైడర్స్

వెంకటేశ్ అయ్యర్ (23.75 కోట్లు) అన్రిచ్ నోర్జే (6.50 కోట్లు) క్వింటన్ డికాక్ (3.60 కోట్లు) అంగ్‌క్రిష్ రఘువంశీ (3 కోట్లు) స్పెన్సర్ జాన్సన్ (2.8 కోట్లు) మొయిన్ అలీ (2 కోట్లు)

రహ్మానుల్లా గుర్బాజ్ (2 కోట్లు) వైభవ్ అరోరా (1.80 కోట్లు) అజింక్య రహానే (1.5 కోట్లు) రోవ్‌మన్ పావెల్ (1.5 కోట్లు) ఉమ్రాన్ మాలిక్(75 లక్షలు) మనీశ్ పాండే (75 లక్షలు)

అనుకూల్ రాయ్ (40 లక్షలు) లవ్నిత్ సిసోడియా (30 లక్షలు) మయాంక్ మార్కండే (30 లక్షలు)

లక్నో సూపర్ జెయింట్స్

రిషబ్ పంత్ (27 కోట్లు) ఆవేశ్ ఖాన్ (9.75 కోట్లు) ఆకాశ్‌దీప్ (8 కోట్లు) డేవిడ్ మిల్లర్ (7.5 కోట్లు) అబ్దుల్ సమద్ (4.2 కోట్లు) మిచెల్ మార్ష్ (3.4 కోట్లు) షాబాజ్ అహ్మద్ (2.4 కోట్లు) ఎయిడెన్ మార్క్రమ్ (2 కోట్లు)

మాథ్యూ బ్రీట్జ్కే (75 లక్షలు) షమార్ జోసఫ్ (75 లక్షలు,) ఎం సిద్దార్థ్ (75 లక్షలు) అర్శిన్ కులకర్ణి (30 లక్షలు) రాజవర్ధన్ హంగార్గేకర్ (30 లక్షలు) యువరాజ్ చౌదరీ (30 లక్షలు)

ప్రిన్స్ యాదవ్ (30 లక్షలు) ఆకాశ్ సింగ్ (30 లక్షలు) దిగ్వేశ్ సింగ్ (30 లక్షలు) హిమ్మత్ సింగ్ (30 లక్షలు) ఆర్యన్ జుయల్ (30 లక్షలు)

ముంబై ఇండియన్స్

ట్రెంట్ బౌల్ట్ (12.50 కోట్లు) దీపక్ చాహర్ (9.25 కోట్లు) విల్ జాక్స్ (5.25 కోట్లు) నమన్ ధిర్ (5.25 కోట్లు,) అల్లా ఘజన్‌ఫర్ (4.8 కోట్లు) మిచెల్ సాంట్నర్ (2 కోట్లు)

ర్యాన్ రికెల్టన్ (1 కోటీ) లిజాడ్ విలియమ్స్ (75 లక్షలు) రీస్ టాప్లే (75 లక్షలు) రాబిన్ మింజ్ (65 లక్షలు) కర్ణ్ శర్మ (50 లక్షలు) విఘ్నేశ్ పుథుర్ (30 లక్షలు) అర్జున్ టెండూల్కర్ (30 లక్షలు)

బెవాన్ జాన్ జాకబ్స్ (30 లక్షలు) వెంకట సత్యనారాయణ పెన్మత్స (30 లక్షలు) రాజ్ అంగద్ బవా (30 లక్షలు) శ్రీజిత్ కృష్ణణ్ (30 లక్షలు) అశ్వనీ కుమార్ (30 లక్షలు)

పంజాబ్ కింగ్స్

అయ్యర్(26.75 కోట్లు) చహల్(18 కోట్లు) అర్షదీప్ సింగ్ (18 కోట్లు,) స్టోయినిస్ (11 కోట్లు) మార్కో జన్సెన్ (7 కోట్లు) వధేరా (4.2 కోట్లు) మ్యాక్స్‌వెల్ (4.2 కోట్లు) ప్రియాన్స్ ఆర్య (3.8 కోట్లు) ఇంగ్లిస్ (2.6 కోట్లు) ఒమర్‌జాయ్ (2.4 కోట్లు)

ఫెర్గూసన్ (2 కోట్లు) విజయ్‌కుమార్ వైశాఖ్ (1.8 కోట్లు) యశ్ ఠాకర్ (1.60కోట్లు) హర్ప్రీత్ బ్రార్ (1.5కోట్లు) ఆరోన్ హార్డీ (1.25 కోట్లు) విష్ణు వినోద్ (95 లక్షలు) జేవియర్ బార్ట్‌లెట్ (80 లక్షలు)

కుల్దీప్ సేన్ (80 లక్షలు) ప్రవిణ్ దూబే (30 లక్షలు) పైలా అవినాశ్ (30లక్షలు) సూర్యాంశ్ షెడ్గే (30 లక్షలు) ముషీర్ ఖాన్ (30 లక్షలు) హర్నూర్ పన్నూ (30 లక్షలు)

రాజస్థాన్ రాయల్స్

జోఫ్రా ఆర్చర్ (12.50 కోట్లు) తుషార్ దేశ్‌పాండే (6.5 కోట్లు) వనిందు హసరంగ (5.25 ?కోట్లు) మహీశ్ తీక్షణ (4.40 కోట్లు) నితీశ్ రాణా (4.2 కోట్లు) ఫజల్ హక్ ఫారూకీ (2 కోట్లు)

క్వేనా మపాకా (1.5 కోట్లు) ఆకాశ్ మధ్వాల్ (1.20 కోట్లు) వైభవ్ సూర్యవంశీ (1.1 కోట్లు) శుభమ్ దూబే (80 లక్షలు) యుద్ధవీర్ చరక్ (35 లక్షలు) ఆశోక్ శర్మ (30 లక్షలు)

కునాల్ రాథోడ్ (30 లక్షలు) కుమార్ కార్తీకేయ (30 లక్షలు)

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

జోష్ హాజిల్‌వుడ్ (12.50 కోట్లు) ఫిల్ సాల్ట్ (11.50 కోట్లు) జితేశ్ శర్మ (11 కోట్లు) భువనేశ్వర్ కుమార్ (10.75 కోట్లు) లియామ్ లివింగ్‌స్టోన్ (8.75 కోట్లు) రసిఖ్ దార్ (6 కోట్లు)

కృనాల్ పాండ్యా (5.75 కోట్లు) టిమ్ డేవిడ్ (3 కోట్లు) జేకబ్ బేతెల్ (2.6 కోట్లు) సుయాశ్ శర్మ (2.6 కోట్లు) దేవ్‌దత్ పడిక్కల్ (2 కోట్లు) నువాన్ తుషార (1.6 కోట్లు)

రొమారియో షెపర్డ్ (1.5 కోట్లు) లుంగి ఎంగిడి (1 కోటీ) స్వప్నిల్ సింగ్ (50 లక్షలు,) మోహిత్ రతీ (30 లక్షలు) అభినందన్ సింగ్ (30 లక్షలు) స్వస్తిక్ చికార (30 లక్షలు) మనోజ్ భాంగడే (30 లక్షలు)

సన్‌రైజర్స్ హైదరాబాద్

ఇషాన్ కిషన్ (11.25 కోట్లు) మొహమ్మద్ షమీ (10 కోట్లు) హర్షల్ పటేల్ (8 కోట్లు) అభినవ్ మనోహర్ (3.20కోట్లు) రాహుల్ చాహల్ (3.20 కోట్లు) ఆడమ్ జంపా (2.40 కోట్లు)

సిమ్రన్‌జీత్ సింగ్ (1.50 కోట్లు) ఎస్‌హాన్ మలింగ (1.2 కోట్లు) బ్రైడన్ కార్స్ (1 కోటీ) జయదేవ్ ఉనద్కత్ (1 కోటీ) కమిందు మెండిస్ (75 లక్షలు) జీషన్ అన్సారీ (40 లక్షలు)

సచిన్ బేబి (30 లక్షలు) అనికేత్ వర్మ (30 లక్షలు) అథర్వ తైడే (30 లక్షలు).

టెస్టు ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా నెంబర్ వన్

న్యూఢిల్లీ: టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ మెన్స్ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో 8 కీలక వికెట్లు తీసిన బుమ్రా, ఈ విజయంతో టీమిండియాకు 295 రన్స్ భారీ తేడాతో గెలుపు అందించారు. ఈ ప్రదర్శనతో బుమ్రా, కగిసో రబాడ, జోష్ హేజిల్‌వుడ్‌లను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సాదించాడు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ రెండో స్థానానికి ఎగబాకారు. పెర్త్ మ్యాచ్‌లో 161 రన్స్ చేసి 825 పాయింట్లతో కెరీర్ బెస్ట్ సాధించారు. అయితే జో రూట్ కంటే 78 పాయింట్ల తేడాతో వెనుకంజలో ఉన్నారు. మరోవైపు 89 రన్స్ చేసిన ట్రావిస్ హెడ్ టాప్ 10లోకి చేరి 10వ స్థానంలో నిలిచారు. విరాట్ కోహ్లీ తన 30వ టెస్ట్ సెంచరీతో 13వ స్థానానికి ఎగబాకిన విషయం తెలిసిందే. టెస్ట్ ఆల్‌రౌండర్స్ జాబితాలో రవీంద్ర జడేజా, ఆర్. అశ్విన్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆసీస్‌తో తొలి టెస్ట్ ఆడకపోయినప్పటికీ, ఈ జాబితాలో వారు ర్యాంకులను నిలబెట్టుకున్నారు. ఇక టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో మొహమ్మద్ సిరాజ్ 25వ స్థానంలో ఉన్నారు. ఈ ర్యాంకింగ్స్ భారత్ క్రికెటర్ల అద్భుత ప్రదర్శనకు ప్రతిఫలంగా నిలిచాయి. బుమ్రా, జైస్వాల్, కోహ్లీ, జడేజా, అశ్విన్ అందరూ తమ ర్యాంకులను మెరుగుపరుచుకోవడంతో, భారత జట్టు టెస్టుల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది.

రెజ్లర్ బజరంగ్ పూనియాపై

4 ఏళ్ల నిషేధం

నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ కఠిన చర్యలు

న్యూఢిల్లీ: భారత ప్రముఖ రెజ్లర్ బజరంగ్ పునియాపై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ కఠిన చర్యలు తీసుకుంది. యాంటీ డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు అతనిపై నాలుగేళ్ల నిషేధం విధించింది. ఈ నిర్ణయం పునియాకి ఆటగాడిగా అతని భవిష్యత్తు మీద గట్టి ప్రభావం చూపనుంది. మార్చి 10న జాతీయ జట్టుకు ఎంపిక ట్రయల్స్ సందర్భంగా డోప్ టెస్ట్ కోసం నమూనా ఇవ్వడానికి బజరంగ్ నిరాకరించడంతో ఈ నిర్ణయానికి వచ్చింది. అంతకుముందు, ఏప్రిల్ 23న టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పునియాను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. అనంతరం, ప్రపంచ రెజ్లింగ్ సంస్థ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్) కూడా అతనిపై చర్యలు తీసుకుంది. ఈ నిషేధంపై బజరంగ్ అప్పీల్ చేశాడు. మే 31న,క్రమశిక్షణా డోపింగ్ ప్యానెల్ నోటీసు జారీ చేయడంతో, అప్పటికే ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. అయితే, జూన్ 23న నాడా అతనికి అధికారిక నోటీసు పంపింది. ఇదిలా ఉండగా, బజరంగ్ తన సహచర రెజ్లర్ వినేష్ ఫోగట్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో అతనికి ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించారు. జూలై 11న బజరంగ్ నేరారోపణలను ధైర్యంగా సవాలు చేశాడు. చివరికి, సెప్టెంబర్ 20, అక్టోబర్ 4న జరిగిన విచారణల తర్వాత ఈ నిషేధం అమలులోకి వచ్చింది.

నయన్ పై దావా వేసిన ధనుష్

నయనతార, ధనుష్ మధ్య కొన్ని రోజులుగా వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. 'బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో 'నానుమ్ రౌడీ డాన్' సినిమాకు సంబంధించిన విజువల్స్ వాడుకోవడానికి నిర్మాత ధనుష్ అనుమతించడం లేదని గతంలో నయన్ ఆరోపించారు. అయితే అనుమతి లేకుండా తన సినిమాలోని విజువల్స్ ఉపయోగించారంటూ నయనతారపై ధనుష్ తాజాగా పిటిషన్ ఫైల్ చేశారు. 'నానుమ్ రౌడీ ధాన్' సినిమా విజువల్స్ ను తన పర్మిషన్ లేకుండా నెట్ ఫ్లిక్స్ 'బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీలో వాడుకున్నారని వండర్ బార్ ఫిల్మ్స్ నిర్మాణ సంస్థ తరపున ధనుష్ బుధవారం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయనతార, ఆమె భర్త విఘ్నేష్ శివన్ లపై పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన న్యాయస్థానం.. విచారణకు స్వీకరించినట్లు తెలుస్తోంది.

ఐదు రోజులు.. 2 కోట్లు.. లక్ అంటే శ్రీలీలదే..!

పుష్ప2లో శ్రీలీల స్పెషల్ సాంగ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పాట కోసం ఆమె అక్షరాల 2 కోట్లు తీసుకున్నది. ఇక షూటింగ్ కూడా జస్ట్ ఐదు రోజుల్లో ఫినిష్ అయిపోయింది. నిజానికి ఓ పెద్ద సినిమాలో పూర్తి స్థాయిలో నటిస్తే శ్రీలీలకు 2 కోట్లు వచ్చేవి. కానీ పుష్ప1 పుణ్యమా? అని ఇప్పుడు ఐదురోజుల్లోనే రెండు కోట్లు వెనకేసుకున్నది. లక్ అంటే శ్రీలీలదే అంటున్నారు సినీ జనాలు. ఓ బాలీవుడ్ భామ ఈ పాట కోసం భారీగా రెమ్యూనరేషన్ డిమాండ్ చేయడంతో ఈ చాన్స్ శ్రీలీలకు వచ్చింది. ఇక పాట హిట్ అయితే పాన్ ఇండియా లెవెల్ లో ఈ అమ్మడు పేరు మారుమోగే చాన్స్ ఉంది. మొత్తానికి ఇటు పాపులారిటీ.. అటూ డబ్బు రెండూ ఒకేసారి సంపాదించుకోబోతున్నది శ్రీలీల. అయితే ఇప్పటికే విడుదలైన కిస్సిక్ లిరికల్ సాంగ్ కు పెద్దగా పాజిటివ్ స్పందన రాలేదు. ఈ పాటకంటే సమంత నటించిన ఊ అంటావా? పాట చాలా బాగుందంటున్నారు సినీ ప్రియులు. మరి సినిమా థియేటర్ లోకి వచ్చాక ఏం జరుగుతుందో వేచి చూడాలి.

అక్కినేని వారి చిన్నకోడలు బ్యాక్ గ్రౌండ్ ఇదే.. !

జైనబ్ రవ్జీ జగన్ సన్నిహితుడి కూతురా?

అక్కినేని అఖిల్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిందే. జైనబ్ రవ్జీతో ఆయన వివాహం జరగబోతున్నది. అయితే ప్రస్తుతం ఈ జైనబ్ రవ్జీ ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? తదితర విషయాల కోసం నెటిజన్లు తెగ సెర్చ్ చేస్తున్నారు. అసలు ఈ జైనబ్ రవ్జీ ఎవరో ఈ కథనంలో తెలుసుకుందాం.. 27 ఏళ్ల జైనబ్ హైదరాబాద్‌లో పుట్టి.. ముంబైలో స్థిరపడ్డారు. ఆమెకు చిత్రకారిణి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి పేరుంది. మన దేశంలోనే కాకుండా దుబాయ్, లండన్‌లోనూ ప్రదర్శనలిచ్చినట్లు తెలిసింది. అంతేకాదు.. ఎంఎఫ్ హుస్సేన్ దర్శకత్వంలో 'మీనాక్షి: ఎ టేల్ ఆఫ్ థ్రీ సిటీస్' సినిమాలో కూడా జైనబ్ రవ్జీ యాక్ట్ చేశారు. ఆ సినిమాలో సీనియర్ హీరోయిన్ టబు, కునాల్ కపూర్ నటించారు. పెయింటర్‌గా మంచి పేరున్నా.. జైనబ్ రవ్జీ చాలా లోప్రొఫైల్ మెయిన్‌టెయిన్ చేస్తుంటారు. ఇక ఆమె తండ్రి జుల్ఫీ రవ్జీ పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ రంగంలో ఆయనకు 30 ఏళ్ల అనుభవం ఉంది. అంతేకాదు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్య సలహాదారునిగా పనిచేశారు. జుల్ఫీ రవ్జీ ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు అత్యంత దగ్గరి వ్యక్తని అని సమాచారం.

త్రిష ఎక్కువ కష్టపడి నటించిన మూవీ ఇదే.. !

నలభై ఏండ్లు దాటినా తరగని అందం త్రిషది. ఒకప్పుడు ఆమె కుర్రాళ్లకు డ్రీమ్ గాళ్. అయితే ఇప్పటికే అవకాశాలు దక్కించుకుంటూ తనకు తగిన పాత్రలను చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇదిలా ఉంటే తాజాగా త్రిషకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని ఆమె తల్లి పంచుకున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా 2004లో విడుదలైన వర్షం మూవీ సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో త్రిష హీరోయిన్. అయితే ఈ మూవీ కోసం త్రిష చాలా కష్టపడిందట. అయితే తన కెరీర్‌లో ఇప్పటివరకు అత్యంత కష్టపడిన సినిమా అంటే వర్షం సినిమానే అని చెప్పుకొచ్చింది ఈ భామ. ఒక తమిళ అవార్డుల వేడుకలో పాల్గొన్న త్రిష కృష్ణన్ తల్లి ఉమ కృష్ణన్ ఈ విషయం చెప్పారు. 'ఈ మూవీ కోసం 45 రోజులు వర్షంలోనే గడిపాం. ఇదంతా చూసి ఈ సినిమా మానేసి చెన్నైకి వెళదాం అనుకున్నాం. కానీ ధైర్యంతో ముందుకు నడిచాం. ఈ సినిమా విడుదలయ్యాక మా కష్టం అంతా మర్చిపోయం. సినిమా చాలా పెద్ద హిట్ అయ్యింది. అని చెప్పగానే.. త్రిష కూడా అవును వర్షం సినిమాకే నేను చాలా కష్టపడ్డాను' అంటూ చెప్పుకొచ్చింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.